పెన్నానర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● సీఎఫ్ ఆర్‌డీపీ చట్టాన్ని రద్దు చేయాలి

● మాజీ ఎమ్మెల్సీలు కత్తి, పోచంరెడ్డిలు డిమాండ్

5

బీజేపీ నేత కందుల మురళీమోహన్‌రెడ్డిపై దాడి





# అభివృద్ధికి వైసీపీ అడ్డు



కాలువలు, కల్వర్టుల ఆధునికీకరణ జరగక రోడ్లపై ప్రవహిస్తున్న వర్షపునీరు

- వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న నేతలు
- వైసీపీకి 41కి 40 మంది కౌన్సిలర్లు
- అధికారం పోవడంతో టీడీపీలోకి 16 మంది జంప్
- జీర్ణించుకోలేక పట్టణ అభివృద్ధిపై కక్ష సాధింపు
- 15వ ఫైనాన్స్ నిధుల వినియోగంలో అంతులేని నిర్లక్ష్యం



ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం

ఎక్కడైనా నిధులు లేక అభివృద్ధి కుంటుపడుతుంది. కానీ ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో వైసీపీ కారణంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 15వ ఆర్థిక సంఘం కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేయకుండా మురగబెడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ఒక్క రూపాయి వర్కూ ప్రారంభించలేని దుస్థితి నెలకొంది.

ప్రొద్దుటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో అభివృద్ధికి రాజకీయ గ్రహణం పట్టుకుంది. 2021 మార్చిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 41 మంది మున్సిపల్ కౌన్సిలర్లకు గాను 40 మంది వైసీపీవారే గెలుపొందారు. దీంతో ఇష్టానుసారం అభివృద్ధి పనులకు టెండర్లు ఎక్సెస్ రేట్లకు వేసుకుని వైసీపీ నేతలు బినామీ కాంట్రాక్టర్లతో రూ.కోట్లు గడించారు. అనూహ్యంగా గత ఏడాది మే లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి భారీ విజయం సాధించింది. ప్రొద్దుటూరులోనూ వైసీపీ అభ్యర్థి రాచమల్లు ఓడిపోయి టీడీపీ నుంచి నంద్యాల వరదరాజులరెడ్డి గెలుపొందారు. రాష్ట్రంలో అధికారం మారడంతో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని 40 మంది వైసీపీ కౌన్సిలర్లలో 19 మంది టీడీపీలో, ఒకరు జనసేన మరొకరు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో వైసీపీ వెంటనే టీడీపీలోకి వెళ్లిన ముగ్గురు కౌన్సిలర్లను తిరిగి సొంతగూటికి రప్పించుకుని మున్సిపల్ పాలకమండలి అధికారాలను చేజారకుండా కాపాడుకుంది. అప్పటి నుంచి టీడీపీ ఆధిపత్యానికి చెక్ పెట్టేందుకు వైసీపీ వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. అందులో భాగంగానే మున్సిపాలిటీలో పనులు జరగకుండా అడ్డుకుంటూ వస్తోంది.

**జనవరి కౌన్సిల్ సమావేశంతో రగడ ప్రారంభం**

జనవరి 31న మున్సిపల్ ఛైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి బడ్జెట్ సమావేశం నిర్వహించి ఆ తరువాత సాధారణ సమావేశాన్ని వాయిదా వేసి వెళ్లిపోయారు. ఆమె వెంట వైసీపీ కౌన్సిలర్లందరూ వెళ్లిపోయారు. ఆ సభలో ఎక్స్ అఫిషియో సభ్యుడుగా పాల్గొన్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి టీడీపీ సభ్యుల కోరం ఉండటంతో కమిషనర్ అనుమతితో సాధారణ సమావేశాన్ని కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 48 అంశాల అజెండాలో 13 అంశాలు రద్దు చేశారు. 35 అంశాలు ఆమోదించారు. ఇందులో మేజరుగా 15వ ఆర్థిక సంఘం వర్కులు. వీటన్నింటిని వైసీపీ నాయకులు బినామి పేర్లతో వేసుకున్నారనే అనుమానంతో ఈ పనుల రద్దుకు ప్రతిపాదించారు. ఈ సమావేశం టీడీపీ సభ్యులు నిర్వహించడం చట్టవిరుద్ధమని ఛైర్‌పర్సన్ హైకోర్టుకు వెళ్లారు. దీంతో ఈ అజెండాలో ముఖ్యమైన అంశాలన్నీ కోర్టు వివాదంలో చిక్కుకున్నాయి. కాగా.. ఫిబ్రవరి నెలలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల కారణంగా కౌన్సిల్‌సమావేశం నిర్వహించలేదు. మార్చి నెలాఖరులో కాకుండా మార్చి 22న వైసీపీ ఛైర్‌పర్సన్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అజెండా అందలేదనే సాకుతో టీడీపీ కౌన్సిలర్లు, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి హాజరుకాలేదు. చివరకు మార్చి 24వ తేదీన సమావేశం నిర్వహించడానికి అంగీకరించారు. ఆ సమావేశానికి కూడా టీడీపీ సభ్యులు రాలేదు.

**వైసీపీ ఇష్టారాజ్యం**

ఏప్రిల్ 9న జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో 53 అంశాల అజెండా చర్చకు పెట్టారు. ఇందులో కూడా 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి దాదాపు రూ.2.96 కోట్ల విలువైన 9 పనులు 10 శాతం కంటే లెస్సుకు వేశారని టీడీపీ కౌన్సిలర్లు రద్దుకు ప్రతిపాదించారు. ఇందుకు వైసీపీ అంగీకరించలేదు. వీటిని వైసీపీ బినామీ కాంట్రాక్టర్లు వర్కులు వేసుకున్నారు. దీంతో 9 టెండరు అంశాలు ఓటింగ్ పెట్టి మెజారిటీతో ఆమోదించుకున్నారు. అయితే తిరిగి మే 31 జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మాత్రం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి 10 శాతం కంటే తక్కువ లెస్సు వర్కులు ఆమోదించవద్దని చెప్పిన సూచనను పాటిస్తామని టీడీపీపై నిందమోపుతూ గతంలో ఆమోదం పొందిన వాటిలో 12 టెండర్లను రద్దు చేశారు. ఆ సమావేశానికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి హాజరుకాకున్నా టీడీపీ కౌన్సిలర్లు ఎవ్వరూ ఈ టెండర్లు రద్దు చేయమని ప్రాతిపాదించకున్నా వైసీపీనే వ్యూహాత్మకంగా వీటిని రద్దు చేసి నెపం ఎమ్మెల్యేపైకి నెట్టింది. తమకు మెజారిటీ ఉందని తామనుకుంటే ఆమోదించగలమని లేదంటే రద్దు చేయగలమని మున్సిపాలిటీలో ఏమైనా చేయగలమని వైసీపీ నేతలు ఎమ్మెల్యే వరద రాజులరెడ్డికి, టీడీపీ కౌన్సిలర్లకు సవాల్ విసురుతున్నారు. దీంతో ప్రొద్దుటూరులో అభివృద్ధి పనులు ఏడాదిగా మూలనపడ్డాయి. ఇప్పటికైనా వైసీపీ వారు ప్రొద్దుటూరు అభివృద్ధికి సకహకరించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

## పోటాపోటీ శంకుస్థాపనలు..!

● ఒక పక్క ఎమ్మెల్యే.. మరోపక్క మేయర్



అశోక్‌నగర్‌లో సీసీరోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి చిత్రంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు

(కడప-ఆంధ్ర జ్యోతి): సార్వత్రిక ఎన్నికలు జరిగి ఏడాది దాటినా కడపలో మాత్రం రాజకీయ వేడి తగ్గడంలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. కడప ఎమ్మెల్యే కూడా టీడీపీనే. కార్పొరేషన్ మాత్రం వైసీపీ చేతుల్లో ఉంది. 50 మంది కార్పొరేటర్లు ఉంటే 9 మంది టీడీపీ వైపు 41 మంది వైసీపీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం నుంచి ప్రతీది కాక రేపుతూ వచ్చింది. కుర్చీ కోసం మొదలైన పోరు అదే వేడితో కొనసాగుతోంది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14.13 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైను ఇతర పనుల కోసం టెండర్లు నిర్వహించారు. ఈ పనులు ఆలస్యం కావడంతో 'అటకెక్కిన అభివృద్ధి' పేరిట ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైంది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మాధవి సోమవారం సాయంత్రం రూ.10.68 కోట్లతో చేపట్టనున్న 167 పనులకు దేవునికడపలో శంకుస్థాపన చేశారు. అయితే మేయర్ కూడా వైసీపీ కార్పొరేటర్ల డివిజన్లలో శంకుస్థాపనలకు శ్రీకారం చుట్టారు. మంగళవారం మేయర్ సురేశ్‌బాబు 5వ డివిజను, 12, 10, 9, 11, 13, 14, 20, 21, 22, 23, 24 డివిజన్లలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కార్పొరేటర్లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఇక ఎమ్మెల్యే మాధవి 5వ డివిజనులోని అశోక్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. మొత్తానికి 15వ ఆర్థిక సంఘం నిధుల కోసం పోటాపోటీగా శంకుస్థాపనలు చేయడంతో మళ్లీ కడపలో రాజకీయ వేడి రగులుకుంది.



24వ డివిజనులో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మేయర్ సురేశ్‌బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు

## పేదరికాన్ని రూపు మాపేందుకే పి-4

- రేపటి నుంచి 5వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలు
- 10వ తేదీ నాటికి బంగారు కుటుంబాల ఎంపిక
- ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



కడప కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికం రూపుమాపడమే లక్ష్యంగా ప్రభుత్వం పి-4 రూపొందించిందని ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో జిల్లాలో పి-4 సర్వే నిర్వహణపై రాష్ట్ర సమగ్ర టీమ్ ప్రతినిధి సాయిసాత్విక్ పవర్ పాయింట్ ద్వారా అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే బంగారు కుటుంబాలను ప్రాథమికంగా సర్వే ద్వారా గుర్తించామన్నారు. అందుకు సంబంధించి తుది జాబితాను రూపొందించేందుకు గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తామన్నారు. 17వ తేదీ లోపు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసి 18 నుంచి ఆగస్టు 5 వరకు గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఇప్పటికే 78 వేల బంగారు కుటుంబాలను గుర్తించామని గ్రామ సభల ద్వారా తుది జాబితాను రూపొందిస్తామని అన్నారు. అక్టోబరు 10 నాటికి అర్హులుగా గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకుంటారన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు మార్గదర్శులను గుర్తిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప, జమ్మలమడుగు, బద్వేలు ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, సీపీవో హజరత్తయ్య, డీఆర్డీయే పీడీ రాజ్యలక్ష్మి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, వ్యవసాయ శాఖఅధికారి చంద్రనాయక్, పరిశ్రమల జీఎం చాంద్ బాషా, డీపీవో ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## జేసీకి శిక్షణ నుంచి మినహాయింపు

కలికిరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ముస్సోరిలో బుధవారం నుంచి శిక్షణలో పాల్గొనాల్సిన కడప జేసీ అదితిసింగ్‌కు ప్రభుత్వం చివరి నిముషంలో మినహాయింపు ఇచ్చింది. ఆమెకు బదులుగా మూడు రోజుల శిక్షణలో పాల్గొనడానికి అనంతపురం జేసీ శివ్‌నారాయణ శర్మను ఎంపిక చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 'మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టుల కోసం భూసేకరణ' అనే అంశంపై ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీ లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీలో బుధవారం నుంచి మూడు రోజులపాటు జరిగే శిక్షణకు పల్నాడు, విశాఖపట్నంతోపాటు కడప జేసీలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అయితే కొన్ని ప్రత్యేక కారణాల రీత్యా తనను శిక్షణ నుంచి మినహాయించాలని కడప జేసీ ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం జేసీ అదితి సింగ్ ఇన్‌చార్జి కలెక్టరుగా కూడా వ్యవహరిస్తున్నారు. దీంతో సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా మంగళవారం ఈ మేరకు మినహాయింపు ఉత్తర్వులు జారీ చేశారు.

## జన్ సురక్ష పథకాలపై అవగాహన కార్యక్రమాలు

కడప కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయిలో జన్ సురక్ష పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. జన్ సురక్ష పథకాలకు సంబంధించి ఈ నెల నుంచి సెప్టెంబరు 30 వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలపై అధికారులతో మంగళవారం కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జి కల్టెర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన్ సురక్ష పథకాలైన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను ప్రజల్లోకి విస్తృత స్థాయిలో తీసుకెళ్లి నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా బ్యాంకు ఖాతాలు లేని కుటుంబాలను గుర్తించి ఖాతాలు తెరిపించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా జరిగేలా డీఆర్డీఏ, మెప్మా, డ్వామా శాఖలను సమన్వయం చేసుకుని వెళ్లాలన్నారు. ప్రతి గ్రామంలో సమావేశాల నిర్వహణకు సంబంధించిన విషయాన్ని ముందుగా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీల్లో బ్యాంకులు ప్రతి బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, లీడ్ బ్యాంకు మేనేజరు జనార్దన్, నాబార్డు ఏజీఎం విజయవిహారి, డీఆర్డీయే పీడీ రాజ్యలక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


వైవీయూలో డిగ్రీ కోర్సులకు ప్రవేశాలు 5

ఏజీ గార్డెన్‌కు ఎక్కిళ్లు!

● వారానికి ఒక్కసారి నీళ్ల సరఫరా

● నాలుగు బిందెల నీళ్లతో సర్దుకుపోతున్నాం..

4


## అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

● 1.5 కిలోల వెండి, బంగారు స్వాధీనం




స్వాధీనం చేసుకున్న బంగారు వెండి వస్తువులు చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మన రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో దొంగతనాలకు పాల్పడుతున్న నల్గొండ జిల్లా భువనగిరికి చెందిన అంతర్రాష్ట్ర దొంగ గజ్జల శ్రీనివాస్(47)ను అరెస్టు చేశామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. నిందితుడు గజ్జల శ్రీనివాస్‌పై రెండు రాష్ట్రాల్లో వివిధ పోలీసుస్టేషన్లలో సుమారు 15 కేసులు ఉన్నాయన్నారు. చలమారెడ్డిపల్లె ఎంఎస్ఆర్ హిల్స్‌లోని ఒక ఇంటిలో, కడప పాత బైపాస్ రోడ్డులోని వెంకటసాయి నగర్‌లోని 2 ఇళ్లల్లో, సాయినగర్‌లో ఒక ఇంటిలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఈ నాలుగు ఇళ్లల్లో జరిగిన దొంగతనాలకు సంబంధించిన పూర్తి చోరీ సొమ్మును రికవరీ చేశామన్నారు. రికవరీ చేసిన వాటిలో ఒక జత బంగారు బుట్టకమ్మలు, బంగార ఉంగరం, 1.5 కిలోల వెండి వస్తువులు, హోండా మోటారు సైకిలు, ఆరు చేతి గడియారాలు, రెండు కెమెరాలు ఉన్నాయన్నారు. చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలోని దేవునికడప ఆర్చి వద్ద నిందితుడిని అరెస్టు చేసి ఇంకో బాల నేరస్థుడిని అదుపులోకి తీసుకుని ఈ వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన కడప చిన్నచౌకు ఇన్‌స్పెక్టర్ ఓబులేసు, ఎస్ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌తో పాటు పలువురు సిబ్బందిని డీఎస్పీ అభినందించి రివార్డుల కోసం సిఫారసు చేస్తున్నట్లు తెలిపారు.

## ధీమా ఇవ్వని బీమా

- ఫసల్ బీమాలో మార్పులు
- ఇది కరువు రైతుకు దెబ్బే
- పొరుగున బీమా ప్రీమియం రూ.1000.. ఇక్కడ రూ.2000



పులివెందుల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైతుకు వెన్నుదన్నుగా నిలవాల్సిన పంటల బీమా చాలా మొక్కుబడిగా మారింది. ప్రకృతి వైపరీత్యంతో పంట సాగు కాకపోయినా 25శాతం పరిహారం ఇచ్చే విధానాన్ని ఫసల్ బీమాలో తొలగించడం రైతుకు తీరని నష్టం చేకూర్చే అంశం.

కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమాను ఎంతో ఉన్నతాశయంతో ప్రారంభించింది. ఈ బీమా రైతులందరికి ధీమాగా నిలుస్తోందని సాక్షాత్తు ప్రధానమంత్రే అప్పట్లో ప్రకటించారు. దానికి అనుగుణంగానే ఫసల్ బీమా అప్పట్లో రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చింది. ఫసల్ బీమాను కేంద్రం ప్రకటిమంచక ముందు వరకు రైతులు ఆయా పంటలు సాగుచేసిన సమయంలో బీమా ప్రీమియం చెల్లిస్తే.. ఏదైనా ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట పండకుండా ఎండిపోతే, పంటకు నష్టం వాటిల్లితే ఆ మేరకు బీమా పరిహారం చెల్లిస్తూ వచ్చేవారు. కానీ ఫసల్ బీమా ప్రవేశపెట్టినపుడు ఆయా పంటలు సాగుచేసి నష్టం వాటిల్లితే పరిహారం చెల్లించడమే కాకుండా.. పంట సాగుకోసం ఆయా బ్యాంకుల్లో రుణాలు పొంది విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుని వర్షం రాకుండా పంట సాగుచేయకపోయినా 25శాతం తక్షణమే రైతులకు పరిహారం అందించేవారు. ఈ మేరకు దాదాపు నాలుగేళ్లుగా ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట సాగుకాకపోతే 25శాతం మేర రైతులకు బీమా పరిహారం అందిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తొలగించిందని అధికారులు చెబుతున్నారు. దీని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది.

**పత్తి పంట బీమా ప్రీమియం చెల్లింపులో అయోమయం**

రైతులు సాగు చేసిన, సాగు చేయబోయే పంటలకు బీమా కోసం ప్రీమియం జూలై 15 నాటికి కొన్ని, జూలై 30 నాటికి కొన్ని పంటలకు చెల్లించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం గడువు విధించింది. పులివెందుల నియోజకవర్గంలో ప్రస్తుతం ఖరీఫ్‌లో పత్తి విరివిగా సాగుచేస్తారు. జూన్ 20 నుంచి జూలై 30 వరకు పత్తి సాగుచేసేందుకు మంచి అదును. పత్తి సాగుచేసిన రైతులందరు ప్రీమియం చెల్లించేందుకు వెనుకాడరు. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు వర్షాలు లేవు. ఇప్పట్లో వర్షం వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు అంటున్నారు. దీనికారణంగా ఫసల్ బీమాలో ఉన్న పత్తిపంటకు ప్రీమియం చెల్లించాలో లేదోనని రైతులు అయోమయంలో ఉన్నారు. ఎందుకంటే ప్రభుత్వం పత్తిపంట ప్రీమియం చెల్లించే గడువు జూలై 15 అని ప్రకటించింది. ప్రీమియం చెల్లించి పంట సాగుచేయలేకపోతే ఆ పంటకు ఇ-క్రాప్ ఉందు కాబట్టి ఎటువంటి పరిహారం దక్కదు. ఒకవేళ జూలై 20, 25 తారీఖుల్లో వర్షాలు కురిసి పంట సాగుచేస్తే అప్పటికి ప్రీమియం చెల్లించే గడువుకూడా ఉండదు. దీనితో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కాగా.. పక్కనున్న అనంతపురం జిల్లాలో పత్తిపంటకు ఎకరాకు రూ.1000 ప్రీమియం వసూలు చేస్తున్నారు. కడప జిల్లాలో మాత్రం ఎకరాకు రూ.2000 చెల్లించాలని నిబంధన పెట్టారు. దీనిపై రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు.

**పంట సాగుచేయకపోతే ఇచ్చే పరిహారానికి స్వస్తి**

ఫసల్ బీమా ప్రకటించిన సమయంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోతే 25శాతం పరిహారం చెల్లించే విధానానికి ప్రస్తుతం ప్రభుత్వం స్వస్తి పలికిందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విజయవాడలోని వ్యవసాయశాఖ కమిషనర్‌ను కలిసి రైతుల్లో ఉన్న అయోమయంపై ఆయనతో చర్చించినట్లు ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఫసల్ బీమా ప్రారంభ సమయంలో ఆ విధానం ఉండేదని, తర్వాత ఆ విధానాన్ని ప్రభుత్వం తొలగించిందని కమిషనర్ తెలిపారన్నారు. పంట సాగుచేసిన రైతులు మాత్రమే బీమా ప్రీమియం చెల్లించాలని లేదంటే ఇ-క్రాప్ నమోదు కాదని, ఇ-క్రాప్ నమోదుకాకపోతే పంట నష్టపోయినా పరిహారం అందదని తెలిపారు. కాగా.. ఫసల్ బీమాలో ముందున్న విధంగానే ప్రకృతి వైపరీత్యాలతో పంట సాగుకాపోయినా పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

# ఏజీ గార్డెన్‌కు ఎక్కిళ్లు!

- వారానికి ఒక్కసారి నీళ్ల సరఫరా
- నాలుగు బిందెల నీళ్లతో సర్దుకుపోతున్నాం..
- అరకొరగా వీధి లైట్లు
- ఒక్క సీసీ రోడ్డు కూడా లేదు ..
- ఇది జిల్లా కేంద్రంలోని ఓ కాలనీ దుస్థితి

రాయచోటి కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వారానికో సారి తాగునీరు సరఫరా చేస్తుండడంతో జిల్లా కేంద్రంలోని ఏజీ గార్డెన్ ఎక్కిళ్లు పడుతోంది. 2013లో ఏర్పడిన ఈ కాలనీలో దాదాపు 100కు పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈ కాలనీ మునిసిపాలిటీ పరిధిలోకి వస్తుందా.. గొర్లముదివేడు గ్రామం చెర్లోపల్లిలోకి వస్తుందా అనే సందిగ్ధంతో సుమారు పదేళ్ల పాటు అభివృద్ధి కుంటుపడింది. 2022లో ఈ కాలనీ మున్సిపాలిటీలోకి వస్తుందని అధికారులు గుర్తించారు. అప్పటి నుంచి రాయచోటి మున్సిపాలిటీ వారు ట్యాంకర్ల ద్వారా నీరు సప్లై చేస్తున్నామని చెబుతున్నారు. అయితే, వారానికి ఒక్కసారి మాత్రమే తాగు నీరు అందుతోందని, ఈ ట్యాంకర్లు ఎప్పుడొస్తాయో తెలియక రాత్రింబవళ్లు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని



కాలనీలోని మట్టి రోడ్డు

కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఇంటికి కేవలం నాలుగు బిందెలు మాత్రమే ఇస్తున్నారని, ఈ నీళ్లతో వారమంతా సర్దుకుంటున్నామని చెబుతున్నారు. ఇలా కాకుండా ఈ కాలనీలో ఒక బోరు వేస్తే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు.

### భయం భయంగా బతుకుతున్నాం

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఏజీ గార్డెన్ కాలనీలో వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో భయం భయంగా బతుకుతున్నామని, సాయంత్రం 6 దాటితే చిన్నపిల్లలు, ఆడవారు బయటికి రాకుండా ఇళ్లకే పరిమితం అవుతున్నారని కాలనీవాసులు చెబుతున్నారు. దాదాపు పదేళ్లుగా నరకం అనుభవిస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా, అరకొరగా లైట్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వతమైన పరిష్కారం చూపడం లేదని అంటున్నారు. ఇంత పెద్ద కాలనీలో కనీసం ఒక్క సీసీ రోడ్డు



నీళ్ల కోసం స్థానికులు ఏర్పాటు చేసుకున్న డ్రమ్ములు

కూడా వేయకపోవడం చాలా దారుణమని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఏజీ గార్డెన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

### ఎగువకాలనీ మా పరిధిలోకి రాదు

ఏజీ గార్డెన్‌లో దిగువ కాలనీ మా పరిధిలోకి వస్తుంది. ఎగువ కాలనీ మా పరిధిలోకి రాదు. ఆ ప్రాంతంలో తాగునీటి సరఫరా విషయం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడగండి. ఆ కాలనీ మొత్తం చెర్లోపల్లి పంచాయతీలోకి వస్తుంది. అయినా నీరు సరఫరా చేస్తున్నాం.

- వాసుబాబు, మున్సిపల్ కమిషనర్

# తైయేరియాసిన్ టీకాలు వేయించండి

- జేడీఏహెచ్ గుణశేఖర్ పిళ్లై



టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న జేడీ గుణశేఖర్ పిళ్లై

కలకడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): పాడి పశువుల్లో తైయేరియా సిస్ వ్యాధి నివారణకోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న టీకా శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై సూచించారు. కలకడ మండలం పొత్తూరివారిపల్లెలో తైయేరియాసిస్ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాధి సోకిన పాడి ఆవులకు తీవ్రమైన జ్వర లక్షణాలుంటాయని తెలిపారు. దీని ప్రభావంతో పాల ఉత్పత్తి తగ్గి రైతుల ఆదాయానికి గండి పడుతుందన్నారు.

జిల్లాలోని పశుకేంద్రాల్లో 18 వేల డోసుల టీకాలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. టీకా లక్ష్య సాధనలో రాష్ట్ర స్థాయి లో జిల్లా మూడవ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కృష్ణయ్య, శివారెడ్డి, లోకేశ్, తేజకల్యాణ్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీమా ప్రీమియం చెల్లించండి : జేడీఏ



రైతులతో మాట్లాడుతున్న జేడీఏ శివనారాయణ

చిన్నమండెం, జూలై15(ఆంధ్రజ్యోతి): వేరుశనగ సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.567 చొప్పున బీమా ప్రీమియం చెల్లించాలని జేడీఏ శివనారాయణ సూచించారు. మంగళవారం కొత్తపల్లిలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్షాభావం నేపథ్యంలో రాగి, ఉద్దులు, పెసర, కంది వంటి పంటలను సాగు చేయాలని రైతులకు వివరించారు.ఎంఏవో రమేశ్‌రాజు, బీ. గీతా, ఆర్‌ఎస్‌కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణిని వేటాడిన వ్యక్తి అరెస్ట్



నిందితుడితో అటవీశాఖ సిబ్బంది

సిద్దవటం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను వేటాడిన కేసులో గోపవరం మండలం వెంకటరామాపురం గ్రామానికి చెందిన బొడిమిగుంట రమణయ్యను అరెస్ట్ చేసినట్లు సిద్దవటం అటవీ శాఖ క్షేత్ర అధికారి కళావతి తెలిపారు. మంగళవారం స్థానిక అటవీ కార్యాలయంలో ఆమె వివరాలు వెల్లడించారు. సోమవారం సిద్దవటం ఫారెస్ట్ రేంజి పరిధిలోని అట్లూరు మండలం చెల్లంగారిపల్లె సమీపంలోని పెనుశిల లక్ష్మీనరసింహ అభయారణ్యంలో ముగ్గురు వ్యక్తులు నాటు తుపాకీతో కొండగొర్రెను వేటాడి, మాంసాన్ని వండుకుని తింటుండగా దాడులు చేసి రమణయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో ఇద్దరు పారిపోయారని తెలిపారు. పారిపోయిన వ్యక్తులు అట్లూరు మండలం చల్లంగారిపల్లెకు చెందిన గుమ్మల వెంకటసుబ్బయ్య, గుమ్మల శ్రీనుగా గుర్తించామన్నారు. వీరి కోసం విస్తృతంగా గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఆరు వన్యప్రాణుల కాళ్లు, వండిన మాంసం కత్తులు, టార్చిలైట్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు చేయించి సిద్దవటం కోర్టులో హాజరుపరిచామని వివరించారు. వన్యప్రాణులను వేటాడినా, హానితలపెట్టిన చట్టాలు చాలా తీవ్రంగా ఉన్నాయని, ప్రతిఒక్కరూ వన్యప్రాణుల సంరక్షణకై పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.


## పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య



చౌడప్ప మృతదేహం

మదనపల్లె అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు తంబళ్లపల్లె మండలం, రామాపురానికి చెందిన వెంకటరమణ కుమారుడు చౌడప్ప (30) బి.కొత్తకోట మండలం, కనికలతోపు వద్ద ఉంటూ, టాటా ఏస్‌లో నీళ్ల సరఫరా చేస్తూ జీవిస్తున్నాడు. సంపాదించిన డబ్బంతా వివాహేతర సంబంధాలకు ఖర్చు చేస్తున్నావంటూ అతని భార్య కనకలక్ష్మి మందలించడంతో సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడిఉన్న యువకుడిని కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బి. కొత్తకోట పోలీసులు తెలిపారు.

## ప్రియురాలు మాట్లాడలేదని..



జయపాల్‌నాయక్ మృతదేహం

రాజంపేట టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తాను ప్రేమించిన యువతి ఫోన్‌లో మాట్లాడలేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం వెంకటపల్లె తాండాకు చెందిన బాల్యా జయపాల్‌నాయక్(19) మోటారు మెకానిక్‌గా పని చేస్తూ రాజంపేట పట్టణంలోని మన్నూరులో నివాసం ఉంటున్నాడు. ప్రేమించిన యువతి ఫోన్‌లో మాట్లాడలేదని మనోవేదనకు గురై, సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి



మృతి చెందిన మల్లికార్జున

మదనపల్లె అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు కింద పడి ఓ యాచకుడు మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మొలకల చెరువు మండలం, బురకాయలకోటకు చెందిన గోవిందు కుమారుడు మల్లికార్జున (23)కు మతిస్థిమితం లేదు. కొంతకాలంగా ఇతను మదనపల్లెలో భిక్షాటన చేస్తూ కడుపు నింపుకునేవాడు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో టిప్పు సుల్తాన్ కాంప్లెక్స్ వద్ద కూర్చుని ఉన్న అతను హఠాత్తుగా రోడ్డుపైకి రావడంతో మదనపల్లె నుంచి గాలివీడుకు వెళుతున్న ఆర్టీసీ వన్ డిపో బస్సు వెనుక చక్రం ఢీకొంది. దీంతో రోడ్డుపై పడి తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు, ఆర్టీసీ వన్ డిపో అసిస్టెంట్ మేనేజరు రేవతి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మమృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తామని వన్‌టౌన్ సీఐ ఎరిసావలి విచారించి తెలిపారు.

## 'బాబుగారూ.. తెలంగాణ ట్రాప్‌లో పడొద్దు'

వేంపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై బుధవారం ఢిల్లీలో కేంద్ర జనవరుల శాఖ మంత్రి పీఆర్ పాటిల్ నేతృత్వంలో జరగబోయే సమావేశంలో తెలంగాణ ట్రాప్‌లో పడవద్దని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సలహా ఇచ్చారు.మంగళవారం ఆయన వేంపల్లెలో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ఆచరణసాధ్యం కాదని మ్యాప్ ద్వారావిలేకరులకు వివరించారు. గోదావరిలో మిగులు జలాలు ఎక్కువగాఉన్నాయని, కొన్ని మేము వాడుకుంటాం కొన్నిమీరు వాడుకోండని తెలంగాణకు బాబు సూచించడం అవగాహనరాహిత్యమన్నారు.

# గణితంపై భయాన్ని పోగొట్టాలి

- విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి
- డీఈవో సుబ్రమణ్యం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే. సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, జూలై15(ఆంధ్రజ్యోతి): గణితంపై విద్యార్థులకు ఉండే భయాలను పోగొట్టడానికి గణితం క్లబ్బులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం సూచించారు. మంగళవారం మధ్యాహ్నం డైట్ అధ్యాపకులు శివభాస్కర్, కేదార్‌నాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రామానుజన్ మ్యాథ్స్ క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మరింత ఆసక్తికంగా, అర్థమయ్యేలా సరళ పద్ధతిలో బోధించడానికి గణిత ఉపాధ్యాయులు నూతన విధానాలను అనుసరించాలన్నారు. ఇందుకు గణిత ఆటలు, పజిల్స్ క్విజ్‌లు వంటివి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయ న్నారు. గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ వంటి వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని సమస్య పరిష్కార నైపుణ్యాలు తార్కిక ఆలోచన, విమర్శనాత్మక ఆలోచన వంటి వాటిని విద్యార్థుల్లో పెంపొందించాలన్నారు. అనంతరం డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు మాట్లాడుతూ డైట్ ఒక ప్రయోగశాలగా బోధనాభ్యసనలో వినూత్న విధానాలను రూపొందిస్తోందన్నారు. మెరుగైన ఫలితాల సాధన దిశగా డైట్ అధ్యాపకులు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి జనార్దన్, ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ బాబు, అధ్యాపకులు వెంకటసుబ్బారెడ్డి, వైసీ రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'ఉర్దూ విద్య'ను బలోపేతం చేయండి

- విద్యాశాఖ మంత్రికి రూటా నేతల వినతి

రాయచోటిటౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉర్దూ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని ఉర్దూ అంగన్వాడీల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఒక కార్యాచరణ ప్రకటించి అభివృద్ధి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముస్తాక్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మెగా డీఎస్సీలో ఉన్నతీకరించిన పాఠశాలలు, మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు చూపించలేదని, వెంటనే ఆ స్థానాల్లో అర్హులైన ఉర్దూ మీడియం విద్యా వలంటీర్లను నియమించాలని వారు కోరారు. 1997, 2000 సంవత్సరాల్లో ఉర్దూ స్పెషల్ డీఎస్సీ, రోష్ని పథకం కింద దాదాపు 210 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్థాపించి ఉర్దూ విద్యా రంగానికి జీవం పోశారని గుర్తు చేశారు. ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేసి అవసరమైన ప్రాంతాల్లో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించాలన్నారు. జిల్లాల్లోని దాదాపు 520 ఇంగ్లీష్, తెలుగు మీడియం పాఠశాలల్లో చదువుకుంటున్న ముస్లిం మైనారిటీ విద్యార్థులు ఉర్దూ మొదటి భాషగా చదవడానికి వీలు కల్పించాలని, అందుకు అనుగుణంగా ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

ఉర్దూ అంగన్వాడీలు స్థాపించాలన్న ముస్లిం మైనార్టీల దశాబ్దాల కల నేటికీ తీరలేదన్నారు. కోరుతున్నా అది నేటికీ జరగలేదని, ముస్లిం మైనార్టీల జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఉర్దూ అంగన్వాడీలు స్థాపించి చరిత్రలో నిలిచిపోవాలని వారు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. నాగార్జున విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన నిర్వహిస్తున్న ఉర్దూ డిపార్టుమెంట్‌ను శాశ్వతంగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, అవసరమైన ఉర్దూ ఆచార్యుల పోస్టులు మంజూరు చేసి ఉర్దూ భాషాభివృద్ధికి పాటుపడాలని వారు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## తాళ్లపాకలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



కొలువు దీరిన సిద్దేశ్వర చెన్నకేశవ స్వాములు

రాజంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాక గ్రామంలో సుమారు 9 రోజులుగా జరుగుతున్న చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో చెన్నకేశవ, సిద్దేశ్వర స్వాములకు వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలతో అభిషేకం చేశారు.

# వృద్ధురాలి హత్య కేసులో ఇద్దరి అరెస్టు

పెద్దమండ్యం, జూలై 15(ఆంధ్రజ్యోతి) మండలంలోని దిగువపల్లికి చెందిన నల్లమ్మ(79) హత్య కేసులో భాగ్యమ్మ, నాగేంద్రనాయుడులను మంగళవారం మండలంలోని బండ్రేవు సమీపంలో అరెస్టు చేసినట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు తెలిపారు. దిగువపల్లి కి చెందిన లక్ష్మయ్య, నల్లమ్మ దంపతులకు నలుగురు కొడుకులు, ఒక కూతురు ఉండగా, అందరికీ వివాహాలయ్యాయి. తండ్రి లక్ష్మన్న మృతి చెందడంతో నల్లమ్మను నెలకు ఒకరు పోషించేలే కొడుకులు తీర్మానించుకున్నారు. ఈ క్రమంలో కొడుకు ఆర్. చంద్రశేఖర్‌నాయుడు వంతు రాగా జూలై 1న వారి ఇంటికి నల్లమ్మ వెళ్లింది. ఈ వ్యవహారం ఇష్టం లేని చంద్రశేఖర్ నాయుడు భార్య భాగ్యమ్మ తరుచూ గొడవ పడేది. ఈ నెల 10న చంద్రశేఖర్‌నాయుడుతో భాగ్యమ్మ గొడవ పడింది. అత్త నల్లమ్మను ఇంటి నుండి తరిమి వేయాలన్న ఉద్దేశంతో రాయచోటిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుకుంటున్న కొడుకు నాగేంద్రనాయుడుకు ఫోన్ చేసి ఇంటికి రప్పిచ్చింది. ఈ గొడవలకు కారణం నాయనమ్మ నల్లమ్మేనంటూ కొడుకును రెచ్చగొట్టింది. ఆదే రోజు సాయంత్రం నల్లమ్మతో భాగమ్మ గొడవ పడుతున్న సమయంలో నాగేంద్రనాయుడు నల్లమ్మ (79) తలకు వెనక భాగంలో ఇటుక రాయితో దాడి చేశాడు. ఛాతీపై కూర్చొని పిడిగుద్దులు గుద్దడంతో ఆమె స్పృహ కోల్పోయింది. విషయం గమనించిన సమీప బంధువులు 108 వాహనంలో తంబళ్లపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడడంతో తిరుపతి రుయా ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ 11వ తేదీ రాత్రి మృతి చెందింది. 12వ తేదీ శనివారం నల్లమ్మ మనుమడు రాజశేఖర్ నాయుడు పెద్దమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు భాగ్యమ్మ, నాగేంద్రనాయుడు ఇద్దరిపై హత్య కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం నిందితులను అరెస్టు చేసి తంబళ్లపల్లి కోర్టుకు తరలించింగా, రిమాండ్‌కు ఆదేశించినట్లు పెద్దమండ్యం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## డ్రిప్పు, స్ప్రింకర్లకు సబ్సిడీ



మాట్లాడుతున్న ఏడీఏ శ్రీలత

సుండుపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ ధరలపై డ్రిప్పులు, స్ప్రింక్లర్లు ఇస్తున్నట్లు మైక్రో ఇరిగేషన్ పీడీ సాయిప్రసన్న తెలిపారు. సుండుపల్లె-3 పరిధిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డ్రిప్‌లు 90 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లు 50 శాతం సబ్సిడీతో అందజేస్తున్నట్లు తెలిపారు. కావలసిన వారు రైతు సేవా కేంద్రాల్లో నగదును చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతుల ఆర్థిక అభివృద్ధికి వ్యవసాయ తోడ్పాటుకు దోహదపడుతుందన్నారు. పంటలు సాగు చేసిన రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని సహాయ వ్యవసాయ సంచాలకురాలు శ్రీలత తెలిపారు. మంగళవారం సుండుపల్లె-3 రైతు సేవా కేంద్రం లోఆమె మాట్లాడుతూ వరి, వేరుశనగ, టమోటా సాగు చేసిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో ప్రీమియం చెల్లించాలన్నారు. దీంతో ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగే నష్టాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుందన్నారు. కౌలు రైతులను గుర్తించి వీఆర్‌వో లాగిన్‌లో నమోదు చేయాలని, రైతు సేవా కేంద్రాల పరిధిలో ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారనే విషయాలను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పాస్‌పోర్టు కేసులో ప్రాసిక్యూషన్‌కు అనుమతి

కలికిరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ పాస్‌పోర్టు వ్యవహారానికి సంబంధించి సుండుపల్లె పోలీసు స్టేషన్‌లో నమోదయిన కేసులో నిందితునిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాస్‌పోర్టు విషయంలో అబ్దుల్ సలాం కుమారుడు ఎస్.అజమ్‌తుల్లా మోసానికి పాల్పడినట్లు సుండుపల్లె పోలీసు స్టేషన్‌లో 2022లో నమోదయిన కేసులో పాత ఐపీసీ ప్రకారం 420 (కొత్త చట్టం ప్రకారం సెక్షన్ 318(4) భారతీయ న్యాయ సంహిత-2023), ఇండియన్ పాస్‌పోర్ట్ యాక్ట్-1967లోని సెక్షన్ 12(1)(ఎ)(బి)ల కింద అభియోగాలు నమోదయ్యాయి. నిందితుడు ఈ వ్యవహారంలో నేరపూరిత ప్రయత్నాలు చేసినట్లు నిర్ధారణ అయినందున అతన్ని ప్రాసిక్యూషన్ చేసేందుకు ప్రభుత్వం నుంచి రాష్ట్ర డీజీపీ అనుమతి కోరారు. ఈ మేరకు తగిన అనుమతులు జారీ చేస్తూ రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

## గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ ఎస్‌ఐ సతీష్ తదితరులు

రాజంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలోని బోయనపల్లె ఆర్టీవో కార్యాలయం సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ సతీష్ తెలిపారు. నిందితులు ఒంటిమిట్ట మండలం చింతరాజుపల్లెకు చెందిన ఈశ్వరయ్య, రాజంపేట మండలం బోయనపల్లెకు చెందిన తోడేటి శేఖర్ నుంచి 2.150 కిలోల గంజాయిని, రెండు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇరువురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలియజేవారు.

## ఉప్పరాండ్లపల్లి సర్పంచు అరెస్టు

- చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టిన పర్యవసానం



పోలీసుల అదుపులో అయూబ్ బాషా

తిరుపతి(నేరవిభాగం), జూలై 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో.. అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టిన కేసులో కడప జిల్లా ఉప్పరాండ్లపల్లికి చెందిన సర్పంచ్ షేక్ అష్రద్ అయూబ్‌బాషాను తిరుపతి సీఐడీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చక్రాయపేట మండలం ఉప్పరాండ్లపల్లికి చెందిన సర్పంచి షేక్ అష్రద్ అయూబ్ బాషా వైసీపీకి విధేయుడు. 2024లో తన ఫేస్‌బుక్ ఖాతాలో చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టాడు. అప్పట్లో చక్రాయపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పోలీసులకు దొరక్కుండా తిరుగుతున్నాడు. మంగళవారం నిందితుడు తిరుపతిలో ఉన్నట్లు సీఐడీ పోలీసులకు సమాచారం రావడంతో అతడి సెల్‌ఫోను నెంబరును ట్రాక్ చేసి అరెస్టు చేశారు. గుంటూరు సీఐడీ కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐడీ సీఐ రంగస్వామి చెప్పారు.

# వాటర్ ప్లాంట్ల మూసివేత

- పంచాయతీ అధికారుల సమన్వయ లోపం
- ప్యూరిఫైడ్ వాటర్ కోసం జనం ఇక్కట్లు



మూతపడిన వాటర్ ప్లాంటు

పీలేరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రజలకు సురక్షిత తాగునీరు అందిస్తున్న 12 వాటర్ ప్లాంట్లు మూతపడ్డాయి. దీంతో ప్రజలు ప్రైవేటు వాటర్ ప్లాంట్‌లపై ఆధార పడాల్సి వస్తోంది. పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ అధికారుల సమన్వయ లోపం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడం కోసం పీలేరు పట్టణంలో 26 మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రతి రోజూ ఇంటికి ఒకటి లేదా రెండు క్యాన్లలో తాగు నీరు ఉచితంగా తెచ్చుకొనేవారు. కొన్నేళ్లుగా ఈ ప్రక్రియ సజావుగా సాగుతోంది. ప్రస్తుతం వీటిలో 12 ప్లాంట్లు మూత పడడంతో క్యాన్‌కు రూ.20 వేలు చెల్లించే శక్తి లేక పేదలు, కూలీలు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వాటర్ ప్లాంట్లలో పని చేస్తున్న 26 మంది వర్కర్లకు గత పది నెలలుగా జీతాలు ఇవ్వలేదు. దీంతో వారు పలు మార్లు పంచాయతీ ఈవో వద్దకు వెళ్లి జీతాలు ఇవ్వాలని పదేపదే వేడుకున్నారు. పలువురు వర్కర్లు పేద వారు కావడంతో ఒకనెల కాకపోయినా ఇంకోనెలలో ఇస్తారన్న ఆశతో పనిచేస్తున్నారు. తీరా పదినెలలు పెండింగ్ పెట్టడంతోపాటు, ఎప్పుడిస్తారో స్పష్టమైన హామీ ఈవో నుంచి రాకపోవడంతో ప్లాంట్లకు తాళాలు వేస్తున్నారు. జీతాలు చెల్లించకపోవడంతో రోజురోజుకూ మినరల్ వాటర్ ప్లాంట్ల పనితీరు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఉన్నవాటిలో ఇప్పటికే 12 మూతపడ్డాయి. మరి కొన్ని చోట్ల రెండ్రు రోజులకోసారి నీరు ఇస్తున్నారు. మూతపడ్డ ప్లాంట్లలో కొన్ని చోట్ల మోటార్లు చెడిపోయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు.

### కలెక్టర్ ఆదేశాల కోసం చూస్తున్నాం...



వాటర్ ప్లాంట్లలో పని చేస్తున్న వర్కర్లకు పది నెలల జీతాలు చెల్లించాలి. ఇందుకోసం పీలేరు ఎమ్మెల్యే కలెక్టర్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం పని చేస్తున్న వర్కర్లకు పెండింగ్ జీతాలు ఇస్తేనే ప్లాంట్ల తాళాలు ఇస్తామంటున్నారు. ఇకపై పంచాయతీ వర్కర్లకు వాటర్ ప్లాంట్ల నిర్వహణ బాధ్యత అప్పగిస్తాం. త్వరలోనే సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటాం.

-లతీఫ్‌ఖాన్, ఇన్‌చార్జి ఈవో, పీలేరు గ్రామపంచాయతీ.

# పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**● పీఎఫ్ ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేయాలి ● మాజీ ఎమ్మెల్సీలు కత్తి, పోచంరెడ్డిల డిమాండ్**

కడప కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు సేవలందించిన పెన్షనర్ల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండికేయడం తగదని, వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, పోచంరెడ్డి సుబ్బారెడ్డిలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా మంగళవారం పెన్షనర్లు కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పాలక ప్రభుత్వాలు వచ్చినప్పటికీ పెన్షనర్లకు న్యాయం చేయడంలో మీనమేషాలు లెక్కించడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశ పెట్టిన ఫైనాన్స్ వ్యాలిడేషన్ అమైన్మెంట్‌ను రద్దు చేయాలన్నారు. 2018 జనవరి నుంచి డీఆర్ బకాయిలు రాలేదన్నారు. వైసీపీ పాలనలో పెన్షనర్లకు చేసిన మేలు శూన్యమన్నారు. మూడు విడతల పెండింగ్ డీఆర్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. పెనన్లకు సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశ పెట్టి, ఆసుపత్రులలో క్యాష్ లెష్ చికిత్సలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చెన్నారెడ్డి, రామ్మూర్తి నాయు డులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్లపై చిన్న చూపు చూడడం తగదన్నారు. ఆర్టీసీ బసుల్లో సీనియర్ సిటిజన్లకు టిక్కెట్లలో రాయితీలు ఇచ్చినట్లుగా రైల్వే, విమాన టిక్కెట్లలో రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటేస్ రికవరీ కాలాన్ని 15 ఏళ్ల నుంచి 11 సంవత్సరాలకు తగ్గించాలని, అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను తెలంగాణ రాష్ట్రంలో పెన్సనర్లుకు ప్రకటించినవిధంగా మన రాష్ట్రంలో మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ పెన్షనర్లకు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ నేత పట్టాభి రామయ్య, నాగమునిరెడ్డి, కత్తి బ్రహ్మయ్య, దస్తగిరిరెడ్డి, రామసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, దేవానంద్, శివరామిరెడ్డి, శ్రీని వాసరాజు, గానుగపెంట హనుమంతరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, పాల్గొన్న పెన్షనర్లు

## 'గండి'లో నేడు టెండర్లు

చక్రాయపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో బుధవారం టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది పాటు పూలు విక్రయించుకొనే హక్కు, టోల్‌గేట్ వసూలుకు సబంధించి హక్కులు కల్పించేందుకు, శ్రావణమాసం ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పుష్పాలంకరణ, ఏర్పాట్లకు సం బంధించి ఇ-టెండరు/సీల్డ్ టెండరు, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే స్థానిక గండి కార్యాలయంలో శ్రావణమాస ఉత్సవాలకు సంబంధించి పులివెందుల ఆర్డీఓ ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందన్నారు.

## 'అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి'

కడప రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జడ్పీ పరిధిలో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించి 2023-24 ప్రావిడెంట్ ఫండ్ వివరాలను అంతర్జాలములో పొందురిచామని డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా అభ్యంతరాలుంటే ఒక నెలలోపు రాత పూర్వకంగా కార్యాలయానికి తెలియజేస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

## భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ వర్క్ షాప్‌లో ప్రతిభ


స్కౌట్ మాస్టర్లను అభినందిస్తున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ వర్క్ షాప్‌లో జిల్లాకు చెందిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్ పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచారు. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు దేశ రాజధాని న్యూఢిల్లీలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కెపాసిటి బిల్డింగ్ నేషనల్ వర్క్‌షాప్‌లో జిల్లాకు చెందిన స్కౌట్ మాస్టర్లు బి.ఖాదర్ బాష, సగినాల అహమద్, గైడ్ కెప్టెన్ వి.చంద్రవతి పాల్గొన్నారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో నాయకత్వ లక్షణాలతో పాటు అనేక సామాజికహిత కార్యక్రమాల గురించి వీరు వర్క్‌షాప్‌లో ప్రజెంటేషన్ చేశారు. క్యాంప్‌ను విజయవంతంగా పూర్తిచేసుకుని జిల్లాకు చేరుకున్నారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ కం సెక్రటరీ, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ కలిసిన అనంతరం వారిని డీఈఓ అభినందించారు. వీరికి నేషనల్ వర్క్‌షాప్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ కార్యశాలలో నేర్చుకున్న అంశాలను జిల్లాస్థాయిలో అమలు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో జిల్లాస్థాయిలో పలు శిక్షణ శిబిరాలు, టెస్టింగ్ క్యాంప్‌లు, వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అందించే శిక్షణ కార్యక్రమాల ప్రయోజనాలను జిల్లాలోని స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్‌లు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## చిత్తూరు జట్టు ఘన విజయం

కడప స్పోర్ట్స్, జులై 15 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా కేవోఆర్ఎం మైదానంలో మంగళవారం ముగిసిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు కడప జట్టుపై ఇన్నింగ్స్ 5 పరుగుల తేడాతో విజయం సాధించింది. వివరాలిలా..
కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-చిత్తూరు జట్ల మధ్య గత మూడు రోజులుగా సాగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 38.4 ఓవర్లలో 139 పరుగులకే చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 51 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 299 పరుగులు చేసింది. అనంతరం ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 71.4 ఓవర్లలో 383 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. దీంతో చిత్తూరు జట్టుకు 244 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 67 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. ఇందులో ఫైజాన్ 58 పరుగులు చేశారు. మూడో రోజు ఓవర్‌నైట్ స్కోర్‌తో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మంగళవారం 85 ఓవర్లలో 239 పరుగుకు ఆలౌట్ అయింది. దీంతో చిత్తూరు జట్టు ఇన్నింగ్స్ 5 పరుగుల తేడాతో విజయం సాధించింది.

## జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ పొడిగింపు

కడప కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంగళవారం జీవో జారీ చేసినట్లు సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్రిడిటేషన్లు అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం ప్రీమియం కింద రూ.1250లు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు, సీఎఫ్ఎంఎస్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్ సైట్ ద్వారా చెల్లించి లబ్ధిపొందాలని సంచాలకులు తెలిపారు.

## వివాదాస్పద ఫ్లెక్సీ ఏర్పాటు కేసులో డాక్టరుతో పాటు మరొకరు అరెస్టు



కడప క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద వివాదాస్పద ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన కేసులో డాక్టరుతో పాటు ఫ్లెక్సీ డిజిటల్ షాపు యజమానిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 12న రాత్రి సుమారు 7 గంటల సమయంలో కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్ వద్ద ఎంత పని సేచ్చివెయ్యా జగనూ.. అని హెడ్డింగ్ పెట్టి 12 పాయింట్స్ కలిగిన ఒక బ్యానరును చెన్నై చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్ నారపురెడ్డి నాగార్జునరెడ్డి, గ్లేస్ ఫ్లెక్సీ డిజిటల్ షాపు యజమాని అమృతరాజులు ఏర్పాటు చేశారన్నారు. ఈ బ్యానర్‌ను పరిశీలించగా అందులో రెండు రాజకీయ పార్టీల మధ్య చిచ్చు పెట్టి ఘర్షణ వాతావరణం సృష్టించి ప్రజాశాంతికి మరియు లా అండ్ ఆర్డరుకు భంగం కలిగించే విధంగా ఉంది. దీనిపై వచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు క్రైం నెం: 148-2025, యు-ఎస్ 61(2) 325 ఆర్‌డబ్ల్యు 3(5) బీఎన్ఎస్ మేరకు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో వారిపురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ మేరకు ఇరువురిని మంగళవారం మధ్యాహ్నం అరెస్టు చేసి, అనంతరం కోర్టులో హాజరు పరిచామన్నారు. ఎవరైనా వాక్ స్వాతంత్ర్యపు హక్కును దుర్వినియోగం చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వివాదాస్పద అంశాలు కలిగిన బ్యానర్‌లను తయారు చేయకూడదని ఫ్లెక్సీ ప్రింటింగ్ తయారీ యజమానులకు డీఎస్పీ సూచించారు. అలాంటి అంశాలు కలిగిన బ్యానర్లు తయారు చేయాలని మీ వద్దకు వస్తే వెంటనే సంబంధిత పోలీసుస్టేషన్‌కు తప్పకుండా తెలిపాలన్నారు. బ్యానర్ కింద ప్రింటింగ్ ప్రెస్ పేరు, ఫోన్ నెంబరును తప్పకుండా ముద్రించాలన్నారు.

## మహిళ ఆత్మహత్య



సువార్తమ్మ మృతదేహం

ఎర్రగుంట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కలమల్ల క్రిష్ణానగర్‌కు చెందిన లక్కానిపల్లి సువార్తమ్మ(35) ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహ త్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు... డ్వాక్రా సంఘం నుంచి సువార్తమ్మ రూ.2లక్షలు రుణం తీసుకుంది. దీన్ని ఆమె కుమారుడు వెంకటేష్ తీసుకున్నాడు. అయితే డ్వాక్రా రుణం డబ్బులు చెల్లించాలని కుమారుని అడుగగా లేవని చెప్పడంతో మనస్థాపం చెందిన ఆమె సోమవారం రాత్రి ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకుంది. గమనించిన చుట్టుపక్కల వారు ఆమెను ప్రొద్దు టూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించింది. కలమల్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తిపై దాడి... కేసు నమోదు

కాశినాయన జూలై 15 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బాలాయపల్లె గ్రామానికి చెందిన వడ్డెపోగు ఓబయ్యపై దాడి చేసిన సంఘటనలో ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేపినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. గత ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి బాలాయపల్లెకు వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, బద్వేల్ టీడీపీ సమన్వయకర్త కే.రితీష్‌రెడ్డి లకు ఎస్సీకాలనీలో అంగన్వాడీ భవనం, తాగునీటికి పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయాలని వడ్డెపోగు ఓబయ్య అర్జీ ఇచ్చారు. కాలనీలోని ప్రభుత్వ భూమిలో మేకల దొడ్డికట్టుకున్న కొమ్మునూరు బాగ్యరాజు తన మేకల దొడ్డిని ఎక్కడ ఖాళీ చేయించి అంగన్వాడీ సెంటర్ నిర్మిస్తారేనని అనుమానించాడు. దీంతో తన తమ్ముడు యోహాన్ కుమారుడు కార్తీక్‌తో కలసి మంగళవారం ఉదయం ఓబయ్యపై అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

## యూసీఐఎల్‌లో ప్రమాదం.. వ్యక్తికి గాయాలు



వేముల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): యూసీఐఎల్‌లో పనులు నిర్వహిస్తున్న ఎస్ఎంఎస్ కంపెనీ సబ్ కాంట్రాక్ట్ నంది కంపెనీలో మేట్‌గా పని చేస్తున్న అబ్దుల్లా ప్రమాదానికి గురయ్యారు. వివరాల్లో వెళితే ... పులివెందుల మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన అబ్దుల్లా మంగళవారం మధ్యాహ్నం మైన్‌లోకి పనికి వెళ్లాడు. ఎక్స్‌కవేటర్‌తో పని చేయిస్తుండగా ఆపరేటర్ పొరపాటున వాహనాన్ని కదిలించాడు. దీంతో వెనుక ఉన్న అబ్దుల్లా మోకాలుకు తగలడంతో కాలు విరిగింది. వెంటనే పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

# వైవీయూలో డిగ్రీ కోర్సులకు ప్రవేశాలు


మాట్లాడుతున్న వైవీయూ రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కడప ఎడ్యుకేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తెలిపారు. మంగళ వారం ప్రిన్సిపాల్ చాంబర్‌లో పలువురు డీన్‌లతో కలిసి సమా వేశమయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడంలో భాగంగా బీఎస్సీ (హానర్స్) ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్స్ కోర్సులు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్, ఎర్త్ సైన్స్ కోర్సులలో త్వరలో ప్రవేశాలు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ కోర్సులు చదవడం ద్వారా భవిష్యత్తు ఆధారిత విద్య లభించడంతో పాటు ఎంచుకున్న రంగంలో లోతైన నైపు ణ్యాన్ని గడిస్తారన్నారు. తద్వారా గ్రాడ్యుయేట్‌లను జాబ్ మార్కె ట్‌కు సరిపడా జ్ఞాన స్కిల్ పొంది సమాజ భవిష్యత్తు అవ సరాలు తీర్చగల పౌరులుగా తయారవుతారన్నారు. బీఎస్సీ (హానర్స్) ఫిజిక్స్‌తో పాటు బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, నానో- సైన్స్, కంప్యూటేషనల్ ఫిజిక్స్, డేటా సైన్స్ ఫిజిక్స్, టెక్నాలజీ విద్యార్థి ఎంపిక చేసుకొని చదివే అవకాశం ఉందన్నారు. బీఎస్సీ (హానర్స్) రసాయన శాస్త్రం మేజర్ సబ్జెక్టుగా తీసుకోవడంతో పాటు అప్లికేషన్ కెమికల్ సైన్స్, కంప్యూటేషనల్ కెమిస్ట్రీ, మెటీ రియల్ సైన్స్ చదవచ్చున్నారు. బీకాం (హానర్స్) కంప్యూటర్ సైన్స్‌ను ప్రధాన అంశంగా కలిగి ఉందన్నారు. బిజినెస్ కామర్స్, కంప్యూటర్ సైన్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ సిస్టం మేనేజ్‌మెంట్ వంటి అంశాలలో బలమైనపునాది వేసే అవకాశం విద్యార్థికి లభిస్తుందన్నారు. నాలుగేళ్ల హానర్స్ కోర్సు ఉత్తమ మార్కులతో పూర్తిచేస్తే నేరుగా రీసెర్చ్‌లో ప్రవేశించే అవకాశం ఉందన్నారు. వైవీయులో వినూత్నమైన కోర్సులు, అత్యాధునిక ల్యాబ్‌లు, నిష్ణాతులైన, ప్రపంచస్థాయి గుర్తింపుపొందిన పరశో. దకులు, అంకితభావం కలిగిన అధ్యాపక బృందం ఉందన్నారు. సమావేశంలో పూర్వ ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రగునాథరెడ్డి, డీన్ ఫర్ అకడమిక్ అఫైర్స్ చంద్ర ఓబుళరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయభారతి పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

**● రూ.21.28 లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల**


పులివెందులలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పులివెందుల రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పరిధిలోని ఎరువుల దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు అంబవరం ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్‌శాఖ డీఎస్పీ పి.మల్లికార్జునరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.వెంకటేశ్వర్లు తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాలలో ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, ఎరువుల నిల్వలు, ప్రత్యక్ష వినియోగం బదిలీ మిషన్ ద్వారా అమ్మకాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఓ దుకాణంలో ఫారం-ఓ నమోదు కాని ఎరువులు, అనుమతి ఫారాలు లేని సుమారు రూ.5.92 లక్షల విలువైన ఎరువులు, మరో ఫర్టిలైజర్స్ దుకాణంలో వివిధ కారణాలతో సుమారు రూ.15.36లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ వ్యవసాయాధికారి గోవర్ధన్, మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి, టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ముద్దనూరు మండలంలో...**

ముద్దనూరు జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు తనిఖీ చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ డీఎస్పీ మల్లికార్జునరావు, కర్నూలు జిల్లా డీఆర్సీ ఏడీఏలు వెంకటేశ్వర్లు, కడప జేడీఏ టెక్నికల్ ఏవో గోవర్ధన్ ఎరువుల దుకాణాలలలోని స్టాక్ రిజిస్టర్లు, గోడౌన్‌లో నిల్వ చేసిన ఎరువులను పరిశీలించారు. లైసన్స్ లేకుండా వ్యాపార లావాదేవీలు సాగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## నేరాలు, బెయిల్ మంజూరుపై సమీక్ష


వర్చువల్ పద్ధతిలో రివ్యూ చేస్తున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంపౌండబుల్ నేరాలు, ఖైదీల బెయిల్ మంజూరుపై మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి తన చాంబర్‌లో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం వర్చువల్ పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని కోర్టు ద్వారా బెయిల్ మంజూరు, కాంపౌండబుల్ నేరాలు, సెక్షన్ 479 బీఎన్ఎస్ఎస్, సెక్షన్ 436ఏ సీఆర్‌పీసీ, 479 బీఎన్ఎస్ఎస్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్, కడప, అన్నమయ్య జిల్లాల జాయింట్ కలెక్టర్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ, కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ, పురుషుల, మహిళ కేంద్ర కారాగారాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, పొగాకు ఉత్పత్తులు వినియోగిస్తే చర్యలు తప్పవు

**● 30 మందిపై కేసు నమోదు**

పులివెందుల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి, పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ చాంద్‌బాష పేర్కొన్నారు. 'సేవ్ క్యాంపస్' పేరిట మంగళవారం ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలతో డీఎస్పీ మురళీ నాయక్ సూచనల మేరకు పొగాకు ఉత్పత్తులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో సిగరెట్లు, బీడీలు తాగవద్దన్నారు. పోలీసుల హెచ్చరిక కాదని బహిరంగ ప్రదేశాలలో వీటిని వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పలు దుకాణాల్లో, బహిరంగ ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో బహిరంగ ప్రదేశాలలో సిగరెట్లు, బీడీలు తాగే 30మందిపై కేసు నమోదు చేశామన్నారు. వీరిపై రూ.6వేలు జరిమానా విధించామని తెలిపారు.

# బీజేపీ నేత కందుల మురళీమోహన్‌రెడ్డిపై దాడి


దాడిలో గాయపడిన కందుల మురళీమోహన్‌రెడ్డి

కడప క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజా రెడ్డివీధిలో కందుల రాజమోహన్‌రెడ్డి తనయుడు, బీజేపీ నేత కందుల మురళీమోహనరెడ్డిపై కేఎస్ఆర్ఎం కళాశాల గ్రూప్ ఛైర్మన్ కందుల చంద్ర ఓబులరెడ్డి ఆలియాస్ నాని తన అనుచరులతో దాడి చేసి గాయపరిచినట్లు వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. రాజారెడ్డి వీధిలోని కందుల రెసిడెన్షియల్‌లో కింద ఫ్లోర్‌లో కందుల మురళీమోహన్‌రెడ్డి నివాసం ఉంటున్నారు. అదే అపార్ట్‌మెంటులోని పై అంతస్తులో చంద్ర ఓబుల్‌రెడ్డి ఉంటున్నారు. అయితే సాయంత్రం మురళీ మోహన్‌రెడ్డి తన పెద్దమ్మతో మాట్లాడుతున్న సమయంలో చంద్ర ఓబుల్‌రెడ్డి తన అనుచరులతో వచ్చి దాడి చేసి గాయపరిచాడు. దీంతో చికిత్స నిమిత్తం ఆయనను రిమ్స్‌కు తరలిం చినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చంద్ర ఓబుల్‌రెడ్డి అలియాస్ నానిపై 323, 341, 34 రెడ్‌విత్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.
ఈ సందర్భంగా బాధి తుడు మురళీ మోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాను తన పెద్దమ్మ ఇంటికి వెళ్లి ఆస్తి పంపకాల గురించి మాట్లాడుతున్న సమయంలో చంద్ర ఓబుల్‌రెడ్డి తన అనుచరులతో కలిసి దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## రిమ్స్‌లో అన్నదాన సేవ



కడప నాగరాజుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్‌లో మంగళవారం అన్నదాన సేవ కార్యక్రమం నిర్వహించారు. కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం గత ఏడాది నవంబరు నుంచి అన్నదాన సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం సుమారు 1000 మందికి భోజనపొట్లాలు అందిస్తూ వస్తున్నారు. వైద్య సహాయార్థం వచ్చిన వారు, వారితో కలిసి వారికి ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ అన్నదాన సేవ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## దుర్గమ్మ చెంత రాహుకేతు పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

కడప కల్చరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచే కాకుండా రాయలసీమ వ్యాపితంగా కూడా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వచ్చే శ్రావణ మాసంలో కూడా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు, ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ వెల్లడించారు.

## టీబీ వ్యాధిపై అవగాహన

పెండ్లిమర్రి, జూలై 15 (ఆంధ్రజ్యోతి):టీబీ వ్యాధిగ్రస్థులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా నందిమండలం ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుర్రాలచింతలపల్లె గ్రామంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్ వైజర్ సుధా మాధురి మాట్లాడుతూ రెండు వారాలు మించి దగ్గు,సాయంత్రం పూట జ్వరం,ఆకలి లేక పోవడం,బరువు తగ్గడం,గళ్ళలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్ష చేసుకోవాలన్నారు. పాజిటివ్ ఉన్న వ్యక్తి ద్వారా 15 మందికి సోకే ప్రమాదం ఉందని,త్వరగా గుర్తించి ఇతరులకు సోకకుండా కాపాడవచ్చన్నారు.ఈ వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారానికి నెలకు రూ.1000లు చొప్పున 6 నెలు వారి అకౌంట్ లో జమ చేయడం జరుగుతుందన్నారు.6 నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు.కార్యక్రమంలో వైద్యసిబ్బంది రవీంద్రనాథ్,వెంకట ప్రసాద్,ప్రసన్న,మౌనిక, దీనరాణి తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్ స్పెషల్ డ్రైవ్

కడప క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలు విద్యాసంస్థల వద్ద 100 మీటర్ల దూరంలో సిగరెట్,పొగాకు సంబంధిత ఉత్పత్తులు విక్రయించడం నిషేధించడంతో ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా చేపడుతున్నారు. మంగళవారం పోలీసు అధికారులు తమ పరిధుల్లోని ఆయా పాఠశాలల, కళాశాల, విద్యాసంస్థలను సందర్శించి 100 మీటర్ల లోపు టీ షాపులు, పాన్, గుట్కా, కిరాణషాపుల్లో సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు అమ్మడం నిషేధమని నిర్వాహకులకు హెచ్చరిస్తున్నారు. జరిమానాలు విధిస్తున్నారు.

## హామీల అమలు చేయని ప్రభుత్వం : వైసీపీ

చెన్నూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చడంలేదని వైసీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. చెన్నూరు గోసుల కన్వెన్షన్ హాలులో మంగళవారం వైసీపీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనరు జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేశ్ యాదవ్, యువజన విభాగం అధ్యక్షుడు పేరుసోముల నిత్యపూజయ్య, సర్పంచ్ తుంగా చంద్రయాదవ్, మాజీ సర్పంచ్ శివయ్య పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మొహర్రం

లింగాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె గ్రామంలో మంగళవారం గ్రామస్థులు మొహర్రాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను గ్రామంలో ఊరేగించారు. భక్తులు చక్కెర చదివింపులు ఇచ్చారు. అనంతరం ఏటికి వెళ్లిన పీర్లకు జెల్ది నిర్వహించారు.



అగ్నిగుండం వద్ద ఉన్న పీర్లు

# కంపు కొడుతున్న దాదా కాల్వ

### వ్యర్థాలు, ఇళ్లలోని ఆహార పదార్థాలు కాల్వలో పడేస్తున్న వైనం ● ఇబ్బందుల్లో స్థానికులు

కడప మారుతీనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నగర 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లె నడిబొడ్డున ఉన్న దాదాకాలువ పూడికతో నిండుకుని కంపు కొడుతోంది. దీంతో దుర్గంధ వాసనకు తట్టుకోలేక కాల్వ సమీప ప్రాంత ప్రజల ముక్కుపుటాలు అదురుతున్నాయి. ప్రధానంగా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఇళ్లతో పాటు ఇంటి సమీప పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిరోజూ కార్పొరేషన్ వాహనాల ద్వారా ప్రచారం చేసుకుంటూ ఇళ్లల్లోని చెత్తా చెదారాన్ని డంప్‌లకు చేరవేస్తున్నారు. అయినప్పటికీ ఏ మాత్రం ఖాతరు చేయకుండా ఇళ్లలో మిగిలిన ఆహారపదార్థాలు, కుళ్లిపోయిన కూరగాయలు ఇతర పదార్థాలతో పాటు పాడు బడిన వస్తువులను ఏకంగా కాల్వలో పడేస్తున్నారు. దీంతో కాల్వలో పూడిక అంతకంతకూ పేరుకుపోయి నిల్వ ఉన్న మురుగునీరు కంపు వాసన వెదజల్లుతోంది. ముఖ్యంగా ఆ కాల్వ పరిసరాల్లోని నివాసుల్లో కొంతమంది చదువుకున్న వారున్నప్పటికీ పూర్తి నిర్లక్ష్య ధోరణితో ఇళ్లల్లోని చెత్త చెదారంతో పాటు ఇతర ఆహార వ్యర్థాలను పాత్రలతో నింపు కుని కాల్వలో పడేస్తున్నారు. ఓ వైపు కార్పొరేషన్ అధికారులు తడిపొడి చెత్తను నిల్వ ఉంచుకుని చెత్తబండి వచ్చినప్పుడు అందులో వేయాలని చెబుతున్నా పట్టించుకోకుండా కాల్వలోనే వేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా కాల్వ పరిసర ప్రాంతాల నివాసులు ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కునేలా చూసుకుని ఆరోగ్యాలు కాపాడుకోవాల్సి ఉంది. అధికారులు స్పందించి కాల్వలోని చెత్తను పూడిక తీయించాలని ప్రజలు కోరుతున్నారు.



దాదాకాల్వలో (ఆలంఖాన్‌పల్లె) పేరుకుపోయిన చెత్తా చెదారం

## సెమిస్టర్ పరీక్షలకు అవకాశం కల్పించాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ పరిధిలో చదువుతున్న డిగ్రీ విద్యార్థులకు 1,2,3,4 సెమిస్టర్ నుంచి ఒక సబ్జెక్టుకు అవకాశం కల్పించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, అఖిలభారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ పద్మను కలిసి వినతిపత్రం అందించారు.

## బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు త్వరగా చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని బీటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల శివార్జున డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.సుదర్శన్‌బాబు, జిల్లా అధ్యక్షుడు మేండ్రగుత్తి గంగరాజు, అన్నమయ్యజిల్లా అధ్యక్షత ప్రధాన కార్యదర్శులు కట్టా గంగాధర్, సురేంద్ర, కార్యదర్శులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు

సీకేదిన్నె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం కాంపల్లి పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని స్థానిక నాయకులు ఇంటింటికీ తిరిగి చేపట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య తేడాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మోహన్‌బాబు, వీరభద్ర, దర్బార్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అమలు

వేంపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని వృషబాచలేశ్వర దేవస్థాన మాజీ చైర్మన్ పీవీ రమణ తెలిపారు. వేంపల్లె పంచాయతీ పరిధిలోని చింతలమడుగులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, గిరిధర్‌రెడ్డి, కరుణ, నాగముని తదితరులుపాల్గొన్నారు.

## పాపాఘ్నినదిలో ఐదు ఫిల్టర్లు



వేంపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా పాపాఘ్ని నదిలో ఫిల్టర్లు వేయిస్తున్నట్లు సర్పంచు ఆర్.శ్రీను తెలిపారు. వేంపల్లెలో తాగునీటి సమస్య ఉత్పన్నమైన నేపథ్యంలో పాపాఘ్నిలో ఉన్న పాతఫిల్టర్లలో నీరు తగ్గిపోవడంతో పంచాయతీ నిధులతో కొత్త ఫిల్టర్లు వేయించినట్లు తెలిపారు. మంగళవారం ఫిల్టర్లను పరిశీలించారు. నీరు ఫిల్టర్లలో సంమృద్ధిగా పడడంతో వేంపల్లె పట్టణంలోని పైప్‌లైన్‌కు అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు.

## సీపీఐ మహాసభలను విజయవంతం చేయండి

వేముల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కరువు వలసలు, ఆత్మహత్యల శాశ్వత విముక్తి కోసం నిధులు, నికర ఇలాల సాధనకు ఈనెల 22 నుంచి 24 వరకు బద్వేలులో జరిగే సీపీఐ 25వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కన్వీనర్ యస్.చాంద్‌బాష ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధి సామాజిక న్యాయమే లక్ష్యంగా ఈ మహాసభలు జరుగుతున్నాయన్నారు. అనేక విషయాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

## చెరువు నిర్మాణానికి స్థల పరిశీలన

లింగాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోపట్నూతల గ్రామంలో నూతన చెరువు నిర్మాణం కోసం తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి, జలవనరుల శాఖ ఈఈ వెంకటరామయ్య, అధికారులతో కలిసి మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో భూగర్భ జలాలు పెంచేందుకు చెరువును నిర్మించాలని రైతులుకోరిన మేరకు స్థల పరిశీలన చేయడం జరిగిందన్నారు. ఈఈ వెంకటరామయ్య మాట్లాడుతూ చెరువునిర్మాణానికి అవసరమైన అయిన ప్రాథమిక స్థల పరిశీలన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల మీట్

పులివెందుల రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండల సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

## ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారుల దాడులు



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

వేంపల్లె,జూలై 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని ఎరువుల దుకాణాలను రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు తనిఖీ చేశారు. పలు దుకాణాలను తనిఖీ చేసి మందులను సేకరించి నాణ్యత పరీక్షించేందుకు పంపుతున్నట్లు ఏఓ శివశంకర్‌రెడ్డి తెలిపారు. రికార్డులు పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. రైతులకు బిల్లులు ఇవ్వకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కర్నూలు జిల్లా ఏడీ వెంకటేశ్వర్లు, తిరుపతి విజిలెన్స్ డీఎస్పీ మల్లికార్జునరావు, వ్యవసాయాధికారి గోవర్దన్ తదితరుల విజిలెన్స్ బృందం ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు.

## పంచాయతీలో పనులు చేయకపోవడం దారుణం



మాట్లాడుతున్న షబ్బీర్ తదితరులు

వేంపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీలో సర్పంచుకు సంబంధించి చెక్‌పవర్ లేదంటూ ఇక్కడ పనిచేస్తున్న ఈవో చిన్నచిన్నపనులను చేయలేనంటూ చెప్పడం చెత్త ఎత్తే ట్రాక్టర్‌కు డీజల్ కూడా వేయలేని పరిస్థితుల్లో ఉండడం దారుణమని, టీడీపీమైనార్టీ సెల్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, జిల్లా గ్రంథాలయ మాజీచైర్మన్ బాలస్వామిరెడ్డి, రైతు విభాగ రాష్ట్ర నాయకుడు జగన్నాథరెడ్డి తెలిపారు. వేంపల్లెలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీలో నీటి సమస్య ఉత్పన్నమైనా, కొళాయి లీకేజీలు ఉన్నాపనులు చేసేందుకు డబ్బు లేదంటున్నారని తెలిపారు. సర్పంచు చెక్‌పవర్‌ను ఏదొక అధికారికి ఇస్తే పంచాయతీలో పాలన ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎద్దుల శేషారెడ్డి, ఎద్దుల నారాయణరెడ్డి, మైనార్టీ నాయకులు మాబుషరీఫ్, తక్కెళ్ల షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎత్తిపోతల ద్వారా రైతులకు సాగునీరు



లింగాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): లింగాల కుడికాల్వ నుంచి తాతిరెడ్డిపల్లె ఎత్తిపోతల పథకం ద్వారా మంగళవారం రైతులకు సాగునీటిని అధికారులు విడుదల చేశారు. మండలంలోని కోమన్నూతల,ఎగువపల్లె,దిగువపల్లె, మురారిచింతల గ్రామాలలో సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నీటిని విడుదల చేశారు. మే నెల వరకు నీటిని అధికారులు విడుదల చేశారు. అయితే వర్షాలు కురవక భూగర్భజలాలు అడుగంటిపోతుండడంతో రైతుల డిమాండ్ మేరకు మళ్లీ అధికారులు నీటిని విడుదల చేయడం జరిగింది.

## 'సూపర్ సిక్స్ పథకాలపై విమర్శలు విడ్డూరం'

పెండ్లిమర్రి, జూలై 15 (ఆంధ్రజ్యోతి):సూపర్ సిక్స్ పథకాలపై వైసీపీ నేతల విమర్శలు విడ్డూరమని మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి తెలిపారు.మండల కేంద్రంలో మంగళవారం ఆయన ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ గద్దెనెక్కి ప్రజల మనోభావాలతో ఎలా ఆడుకున్నారో, 2024 ఎన్నికల్లో మీకు వచ్చిన 11 సీట్లను చూస్తే తెలుస్తుందన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా భవిష్యత్‌కు గ్యారెంటి కార్యక్రమంతో చెప్పినవి చేసి చూపిస్తూ ఉండటం మీకు కనిపించలేదా అన్నారు. నాయకులు రఘు,బయన్న, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

కమలాపురం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి మధుసూదన్ రావు తెలిపారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణం నుంచి పోలీసులు , న్యాయవాదులు, ప్రజలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయస్థానాల్లో మధ్యవర్తిత్వమే శాంతియుత మార్గం అన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో భాగంగా మూడురోడ్ల కూడలి వరకు ద్విచక్రవాహనం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పుష్పరాజ్, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, మహేశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధుల పట్ల

## ప్రజల్లో అవగాహన కల్పించాలి

● జిల్లా మలేరియా అధికారి మనోరమ

సింహాద్రిపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ పేర్కొన్నారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని బిదినంచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు ఏర్పాటు చేసిన సమావేశంలో మనోరమ సిబ్బందికి దోమ కాటు వల్ల సంభవించే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వెక్టర్ కంట్రోల్(దోమల నియంత్రణ)లో ఉపయోగించే పద్ధతుల గురించి ఆరోగ్య కార్యకర్తలకు తగిన సూచనలు, మార్గదర్శకాలు ఇచ్చారు. కార్యక్రమంలో సబ్-యూనిట్ అధికారి సిద్దయ్య, పీహెచ్ఎన్ పద్మావతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రావెల్ కుప్పలు చదును



చెన్నూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నూరు నుంచి కడపకు వెళ్లే హైవే రహదారిలో చిన్నమాచుపల్లె వద్ద రోడ్డు మార్జిన్‌లో వేసిన గ్రావెల్ కుప్పలను మంగళవారం చదును చేసి రోలర్‌తో తొక్కించారు. దాదాపు పదిరోజులకు పైగా రోడ్డు మార్జిన్‌లో గ్రావెల్ కుప్పలు వేయడం జరిగింది. వాటిని వేసిన రెండు మూడురోజులకే చదును చేయాల్సి ఉంది. అయితే 10 రోజులైనా పట్టించుకోకపోవడంతో ఆంధ్రజ్యోతిలో ప్రమాదం జరిగితే కానీ పట్టించుకోరా, వదిలేస్తారా అన్న కథనం రావడంతో హైవే సిబ్బంది స్పందించి మంగళవారం ఎక్స్‌కవేటరుతో గ్రావెల్ కుప్పలను చదను చేసి రోలర్‌తో తొక్కించారు.

## కేసీ కాల్వలో మురుగు, వ్యర్థాలు తొలగింపు

చెన్నూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు వద్ద హైవే నుంచి లక్ష్మీనగర్,కొత్తగాంధీనగర్ ప్రాంతాల మధ్య ఉన్న కేసీ కాల్వలో చాలాకాలంగా పేరుకుపోయిన వ్యర్థాలను మంగళవారం రెండు ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేసి పూర్తిగా తొలగించారు. అలాగే కాల్వకు ఇరువైపులా పెరిగిన మొక్కలు సైతం తొలగించడం జరిగింది. నాలుగురోజుల క్రితం ఈ కాల్వపై బుగ్గవంకను మరిపిస్తున్న కేసీ కాల్వ అన్న కథనం ప్రచురితం కావడంతో మంగళవారం ఎక్స్‌కవేటరు సాయంతో కేసీ అధికారులు తొలగించారు. దీంతో వ్యర్థాలు తొలగిపోవడం, మొక్కలు తీసివేయడం, దోమలు లేకుండా చేయడం జరిగిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



## ప్రకృతి వ్యవసాయంతో కూరగాయల సాగు

లింగాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులు కూరగాయల సాగు చేపట్టాలని లింగాలఏవో రమేష్ అన్నారు. లింగాల మండలం మురారిచింతల గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని వంకాయతోటలో నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు అందించేందుకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏఓ రమేష్

## భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు వేయాలి

కమలాపురం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు ఆధారంగా అధికారుల సూచనల మేరకు పంటలకు ఎరువులు వేయాలని ఏవో సరస్వతి తెలిపారు. మండల పరిధిలోని నల్లింగాయపల్లె, తురకపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో ఉల్లి మినుము పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి డీఆర్సీ సుచిత్ర, జడ్పీటీసీ సుమిత్రమ్మ, రైతులు పాల్గొన్నారు.

## యాంత్రీకరణ పథకం ద్వారా ఖర్చులు తగ్గుదల

వేముల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): యాంత్రీకరణపథకం ద్వారా పంటల సాగులో ఖర్చులు తగ్గించుకొని మంచి దిగుబడులు సాధించేటట్లు ఉండాలని మండల వ్యవసాయాధికారి జి.పి.ఓబులేష్ తెలిపారు. మంగళవారంమండలంలోని కుప్పగుట్టపల్లె, చింతలజూటూరు గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీహెచ్‌ఏ లక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చౌడేశ్వరీదేవి అమ్మవారికి సారె,చీరె సమర్పణ



భజన చేస్తూ చీరె, సారెను అమ్మవారికి ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

మైలవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామంలో ఆషాఢమాసాన్ని పురష్కరింకుని తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవమైన చౌడేశ్వరీదేవి అమ్మవారికి గ్రామ ప్రజలు, మహిళలు, పెద్ద ఎత్తున చీరె, సారె సమర్పించారు. మంగళవారం ఇంటి వద్ద నుంచి పురవీధుల గుండా భజన పాటలు పాడుకుంటూ చౌడేశ్వరీదేవి ఆలయం వద్దకు చేరుకుని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి చీరె, సారె సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




మాట్లాడుతున్న జడ్జి ఖాజా మైనుద్దీన్

చాపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి):ప్రజలు చట్టాలపైన అవగాహన పెంచుకోవాలని మైదుకూరు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి ఖాజా మైనుద్దీన్ పేర్కొన్నారు. అన్నవరం గ్రామంలో మంగళవారం రాత్రి చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రజలు డబ్బులకు సంబంధించిన బాండ్లు సమయం ముగియకముందే వాటిపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఏ వైనా సమస్యలు వస్తే శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. తహసీల్దారు రమాకుమారి, అడ్వకేట్లు చారి, శివరామ కృష్ణ, కరిముల్లా, శర్మ, వాహబ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మడూరు కాలువకు రక్షణగోడ నిర్మించండి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంపీజే నాయకులు

ప్రొద్దుటూరు అర్బన్ జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని మడూరు కాలువకు రక్షణగోడ నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి ఎంపీజే నాయకులు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మడూరు కాలువకు రక్షణగోడ లేనికారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మూమెంట్ ఫర్ పీస్ అండ్ జసిస్ రాయలసీమ ఇన్‌చార్జి ఎండీ అయూబ్ ఖాన్, పట్టణ అధ్యక్షుడు హుసేన్‌బాష, జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ ట్రెజరర్ ఇస్మాయిల్, సభ్యులు ముక్తియార్, అల్లాబకష్, ఫర్హన్ పాల్గొన్నారు.

## దువ్వూరు వద్దకు చేరిన కేసీ నీరు



దువ్వూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేసీ కాలువలో నీటి ప్రవాహం మంగళవారం తెల్లవారుజామున దువ్వూరు వద్దకు చేరింది. కాలువలో రాజోలి వద్ద సోమవారం 200 క్యూసెక్కులు వదిలారు. ఆ ప్రవాహాన్ని మంగళవారం ఉదయం 300లకు పెంచారు. సాయంత్రం మరో వంద క్యూసెక్కులు కలిపి 400 వదిలినట్లు ఇడమడక ఏఈ జమాల్‌వలి తెలిపారు.

# సా..గని రోడ్డు విస్తరణ పనులు



రోడ్డుకు ఇరువైపుల విస్తరణ పనులు ఆగిపోయిన దృశ్యం

పోరుమామిళ్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగడంలేదు. గత వైసీపీ హయాంలో పోరుమామిళ్లలో 80 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ పనులు నిధులు కేటాయించి సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసి ఆధునీకరిస్తామని దాదాపు రూ.20కోట్లు కేటాయించారు. అయితే సకాలంలో బిల్లులు అందకపోవడం, అంచనాల ప్రకారం నిర్మాణాలు చేపట్టక కొన్నేళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాయకులు కాంట్రాక్టర్లను పనులు చేయడానికి ఒప్పించడం, పెండింగు బిల్లులు రావడంతో తిరిగి పనులు ప్రారంభించారు. రోడ్డుకిరువైపులా మొత్తం ఐదు అడుగుల వెడల్పుతో డ్రైనేజీ కాల్వలు, 8 అడుగుల వెడల్పుతో ప్లాట్‌పారం 48 అడుగుల వెడల్పుతో రోడ్డు, మిగిలిన స్థలంలో డివైడర్ల నిర్మాణాలు చేపట్టేందుకు పనులు ప్రారంభించారు. కానీ నెల తిరగకుండానే ఆటంకాలు ప్రారంభమయ్యాయని చెప్పాలి. కొందరు ఇంత వెడల్పు రోడ్డు అవసరమా? అంటూ అభ్యంతరాలు తెలుపుతుండగా మరికొందరు తమ స్థలానికి రిజిస్ట్రేషన్ ఉందని నిర్మాణాల్లో స్థలాలు కోల్పోతే వాటికి నష్టపరిహారం చెల్లించాలని కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. కొందరు నిర్మాణాలు తొలగించేటప్పుడు ముందుగా మా పక్కవారి నిర్మాణాలు తొలగించి తరువాత మావి తొలగించండి లేకుంటే ఊరుకునేదిలేదని చెప్పిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇలా అనేక అభ్యంతరాల మధ్య ఈ పనులు ఎప్పుడు పూర్తి చేయాలో తెలియక అటు అధికారులు ఇటు కాంట్రాక్టర్లు తలలు పట్టుకుంటున్నారు. రంగసముద్రం నుంచి పోరుమామిళ్ల టౌన్ వరకు ముందు విస్తరణ పనులు పూర్తి చేస్తే తరువాత ఇరువైపులా నిర్మాణాలు చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల అంబేద్కర్ సర్కిల్ వద్ద డ్రైనేజీ కాల్వ, ప్లాట్‌పాం నిర్మాణాలకు దాదాపు 11 అడుగుల వెడల్పుతో సున్నంతో మార్కింగ్ కూడా వేసి కొందరు ఆ స్థలాలను ఖాళీ చేశారు. కానీ విద్యుత్ స్తంభాలు మాత్రం ఇప్పటి వరకు తొలగించిన దాఖలాలులేవు. విద్యుత్ శాఖకు సంబంధించి ఇంకా రావాల్సిన డబ్బులు చెల్లించకపోవడంతో సమస్య అలాగే ఉండిపోతోంది. ఇదే రహదారిలో ప్రభుత్వ కళాశాల వద్ద మరో చోట విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఒక వైపు నిర్మాణం జరుగుతుండడంతో ఉన్న ఒక వైపునే వాహనాలు వెళ్లాల్సి ఉండడంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. అమరావతికి వెళ్లే వాహనాలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో పోరుమామిళ్ల ఎక్కువగా రద్దీగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో నిర్మాణాలు ఎటువంటి ఆటంకం జరగకుండా ఎప్పుడు పూర్తవుతాయో ఎదురు చూడాల్సిందే.

**ఆర్ అండ్‌బీ డీఈ ఏమన్నారంటే:** రహదారి విస్తరణ పనులు ఆలస్యం విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ సలీంను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, రెవెన్యూ అధికారులు చూపించిన హద్దుల వరకే తాము నిర్మాణం చేపడతామన్నారు. ఆక్రమణల తొలగింపు విషయమై కొందరు కోర్టుకు వెళ్లినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

## ముద్దచర్మవ్యాధి నివారణకు టీకాలు వేయించాలి

బ్రహ్మంగారిమఠం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాడిరైతులు వారు పెంచుకుంటున్న ఆవులు, ఎద్దులకు (తెల్లపశువులు) ముద్ద చర్మవ్యాధి రాకుండా ముందస్తు నివారణ కోసం టీకాలు వేయించుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచా లకుడు డాక్టర్ కె.వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు మండలంలోని తోట్లపల్లె గ్రామంలో దాదాపు 32 ఆవులు, ఎద్దులకు ముద్ద చర్మవ్యాధి రాకుండా టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 31 వరకు ఉచితంగా టీకాలు వేస్తున్నామని ఈ అవకాశాన్ని రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మహేశ్వరరెడ్డి, సహాయకులు నందిని, శివయ్య, నాగరాజు, రైతన్నలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ




బ్రహ్మంగారిమఠం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని 260 మంది విద్యార్థులకు పోరుమామిళ్ల చిత్రశౌరి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ సహకారంతో 780 నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మంగళవారం సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత థామస్‌రెడ్డి, చిత్తాదంపతుల ఆధ్వర్యంలో వారి ప్రతినిధి ఎల్.ప్రసాద్‌రెడ్డి బ్రహ్మంగారిమఠం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎద్దులాయపల్లె, చెంచయ్యగారిపల్లె, తోట్లపల్లెలోని ఆర్సీఎం ప్రాథమిక పాఠశాలల బాలబాలికలకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యను పరిష్కరించిన రితీష్‌రెడ్డి



విద్యుత్ స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గోపవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండలంలోని బ్రాహ్మణపల్లెలో గత ఏడాది కాలంగా ఒక వీధికి విద్యుత్ లేక అవస్థలు పడుతుండగా బద్వేలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి పరిష్కరించారు. ఈ సమస్యపై స్థానిక టీడీపీ నాయకుడు శివశంకర్‌రెడ్డి, రితేష్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను 24గంటల్లోపు పరిష్కరించడంతో అక్కడి నాయకులతోపాటు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమస్యపై పలుమార్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా ఎటువంటి ఫలితం రాలేదని ఇప్పుడు కొత్త పోల్స్ వేసి లైను లాగి ప్రతి ఇంటికి కనెక్షన్ అందించారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు ఏఈ శివ, లైన్‌మెన్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు యువత అధ్యక్షుడిగా చిన్నా ఎంపిక

మైదుకూరు రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడుగా బురుగోళ్ల చిన్నాను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఎంపిక చేశారు. ప్రొద్దుటూరులోని పార్టీ కార్యాయలం వద్ద మంగళవారం ఎమ్మెల్యేని చిన్నా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన పార్టీలో యువకులు ఎక్కువగా ఉత్సాహంగా పనిచేస్తున్నారని .యూత్ పాలోయింగ్ ఉన్న చిన్నాను సోషియల్ మీడియాను బలోపితం చేయాలంటూ కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర,ఆసుపత్రి కమిటీ చైర్మన్ చిన్న, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రమణ,బండి అమర్‌నాథ్, భూమిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

## సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన కల్పించండి

మైదుకూరు రూరల్, జులై 15(ఆంధ్రజ్యోతి) : ప్రజల నివాసాలపై సోలార్ రూఫ్‌టాప్ ల గురించి అవగాహన కల్పించాలని విద్యుత్‌శాఖ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య తెలిపారు.స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో మంగళవారం మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, దువ్వూరు, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి కోడూరు, బద్వేల్, గోపవరం, బ్రహ్మంగారిమఠం, అట్లూరు మండలాల అధికారులతో ఆయన మాట్లాడుతూ .సోలార్ పథకం కోసం కేంద్రం సబ్సిడీ ఇస్తుందనే విషయాన్ని ప్రజలకు తెలియచేశాలని సూచించారు.

## రైతులు నానో టెక్నాలజీకి ప్రాధాన్యమివ్వాలి

ప్రొద్దుటూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ శాఖ ప్రొద్దుటూరు ఏడీఏ అనిత, ఏవో వరాహరికుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చెన్నమరాజుపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం సందర్భంగా రైతులు సాగుచేసిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి అనంతరం రైతు సేవా కేంద్రంలో అన్నదాతలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. . ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**బి.కోడూరులో :** మండలంలోని రైతులు ఖరీఫ్‌లో సాగు చేసే వరి, మొక్కజొన్న పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి కౌశిక రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలపరిధిలోని పెదుళ్లపల్లె, పాయలకుంట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్ 2025 పంటల బీమా కోసం రైతులు ప్రీమియం చెల్లించాలని, దిగుబడి ఆధారిత పంటలకు ఈ నెల 31 చివరి తేది అని, వరికి ఆగస్టు 15న చివరి తేది అని, పీఎం కిసాన్ ఏబీపీఎస్, ఈకేవైసీ, పెండింగు లిస్టు ఆయా రైతు సేవా కేంద్రాల్లో ఉన్నాయని సంబంధిత రైతులు త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**కాశినాయనలో:** మండలంలోని ఆకులనారాయణపల్లె, గంగనపల్లె గ్రామాల్లో మంగళవారం ఏఈవో రవి ఆధ్వర్యంలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రంలో పాల్గొన్న ఏవో చంద్రమోహన్ మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలకు పురుగు మందులకు బదులు గ్రామంలో లభించే ఆవుపేడ మూత్రం పుట్టమన్నుతో తయారుచేసిన కషాయాన్ని పిచికారి చేసుకుంటే మంచిదన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో అరటిని పరిశీలించి తెగుళ్లను ఎలా నివారించవచ్చో వివరించారు. కార్యక్రమంలో గంగనపల్లె సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, వీఏఏ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

**దువ్వూరులో:** జొన్నపంట సాగు చేసే రైతులు సంబంధిత కంపెనీలతో అగ్రిమెంట్లు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. పంట దిగుబడి రాని పక్షంలో అగ్రిమెంట్ వలన రైతులకు పరిహారం సదరు కంపెనీలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి సాగుచేసే పసుపు, ఉల్లి, మినుము, వరి, కంది లాంటి పంటలకు బీమా చేసుకోవాలని చెప్పారు.

## ప్రభుత్వ భూమిని గృహాలకు కేటాయించాలి

బద్వేలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి ): గోపవరం మండలంలోని 1557 సర్వే నెంబరులోని 15 ఎకరాల ప్రభుత్వ భూమిని నిరుపేదలకు ఎన్టీఆర్ గృహాలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నేతలు టీడీపీ నియోజకవర్గ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఆమేరకు మంగళవారం వారు ఆయనకు వినతిపత్రం అందించారు. అనంతరం లిబరేషన్ పార్టీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజవర్గంలో సెంచురీ లాంటి పరిశ్రమలు రావడంతో అనేకమంది యువత, కార్మికులు తమ జీవనోపాధి కొరకు పట్టణంలోని బాడుగ ఇళ్లలో నివాసం ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చంద్రమోహన్‌రాజు, జకరయ్య పాల్గొన్నారు.

## గెస్ట్ అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో గెస్ట్ అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు బాటనీ ఉర్దూ, కెమిస్ట్రీ ఉర్దూ సబ్జెక్టులలో 50 శాతం మార్కులు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 19వ తేదీలోపల దరఖాస్తులు అందజేయాలని 21న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

## రక్తదానంతో ప్రాణదానం

ఎర్రగుంట్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని మానవత చైర్మన్ డి.రఘురామిరెడ్డి, డీగ్రీకాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ రవి పేర్కొన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎర్రగుంట్ల డిగ్రీ కాలేజి వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 20మంది రక్తదానం చేశారు. అగాసే ఫౌండర్ కే.జాన్, మానవత మధుసూధన్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీరాములు, నరేంద్రరెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## వైష్ణవి హంతకుడిని ఉరి తీయాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రేమపేరుతో మోసం చేసి హత్య చేసిన నిందితుడు లోకేష్‌ను ఉరి తీయాలని విద్యార్థి ప్రజాసంఘాల నాయకులు మంగళవారం ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దారు సుదర్శన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, ఎన్డీయే రాష్ట్ర అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ ప్రేమ పేరుతో విద్యార్థినులను వేదించడం, మాట వినకపోతే హత్య చేయడం ఇటీవల కాలంలో పరిపాటిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు జేష్టాది బాస్కర్, యోగేంద్ర, చంద్ర, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గండికోటలో విద్యార్థినిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినిని నమ్మించి హత్య చేయడం దారుణమన్నారు. ఏఐఎస్‌ఎఫ్ పట్టణాధ్యక్షుడు పీటర్, మోహన్ పాల్గొన్నారు.

## 21 న కొండాపురం మండల సమావేశం

కొండాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 21 న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశంలో మండలంలోని అభివృద్ధి పనులపైనా, సమస్యలపైనా చర్చించడం జరుగుతుందన్నారు. కావున ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు.

## చిన్నేపల్లెలో ఐదో తరగతి వరకు కొనసాగించాలి

- విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్
- ప్రభుత్వానికి నివేదికలు పంపామన్న డీఈవో



పాఠశాల తరగతుల విలీనంపై విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో

అట్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు మండలంలోని చిన్నేపల్లె పాఠశాలను ఐదో తరగతి వరకు కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పాఠశాలల మ్యాపింగ్‌లో భాగంగా విద్యాశాఖాధికారులు ఇటీవల ఎస్.వెంకటాపురం పాఠశాలకు 3,4,5 తరగతుల విద్యార్థులను విలీనం చేశారు. దీంతో చిన్నేపల్లెలోనే పాఠశాలను యథావిధిగా ఉంచాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా ఈ విషయంపై మంగళవారం డీఈవో షంషుద్దీన్ చిన్నేపల్లె పాఠశాలను పరిశీలించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఎఉస్.వెంకటాపురం పాఠశాలకు మా పిల్లలను వెళ్లబోరని, కనీసం తల్లిదండ్రులకు పాఠశాల విద్యాకమిటీలకు సమాచారం ఇవ్వకుండా మండల విద్యాశాకాధికారులు విలీనం చేశారని, డీఈవో ఎదుట వాపోయారు. దీనిపై డీఈవో షంషుద్దీన్ మాట్లాడుతూ మీ సమస్యలపై ప్రభుత్వానికి నివేదికలు పంపామని, స్కూల్సు రిపోర్టు జాయింట్ కలెక్టర్‌కు పంపించామని, త్వరలోనే పరిష్కారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఎస్.వెంకటాపురం పాఠశాల వసతులు సక్రమంగా లేకపోయినా మోడల్ స్కూలుకు ఎలా ప్రకటించారంటూ స్థానిక ఎంఈవో విలియంరాజు, ఖాదర్‌వల్లిని డీఈవో ప్రశ్నించారు. అలాగే బెడుసుపల్లె, మలినేనిపట్నం స్కూళ్లను పరిశీలించారు. స్కూలు కిలోమీటరు దూరం ఉండడంపై తమ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని డీఈవో ఎదుట తల్లిదండ్రులు వాపోయారు. సమస్య పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

## ప్రజలు బుద్ధి చెప్పినా ..మీ తీరు మారదా..?

- మాజీ ఎమ్మెల్యేపై ఎమ్మెల్యే పుట్టా ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి) :గత ఎన్నికల్లో 151 సీట్ల నుంచి ప్రజలు 11 సీట్లలో మిమ్మల్ని కూర్చో పెట్టినా! మీ తీరు మారదా? అంటు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిపై మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మండిపడ్డారు. స్థానిక టీడీపీ కార్యాలయంఓ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ గత వేసవిలో చెరువులకు నీరు నింప కూడా మున్సిపాలిటీ ప్రజలను ఎండగడితే, నా అదేశాలతో మా నాయకులు నీళ్ల ట్యాంకర్లు పెట్టి వీధులకు నీళ్లను తోలిన విషయం మరిచిపోయారా? అంటూ ప్రశ్నించారు. మీరు వందల ఎకరాల భూములను ఆక్రమించారు. అదే విధంగా పేదల భూములను పోలీసుల సాయంతో దౌర్జన్యంతో ఆక్రమించలేదా? అని ఎమ్మెల్యే పుట్టా ఆరోపించారు. మైదుకూరు మున్సిపల్ ఎన్నికల్లో మాకు దక్కాల్సిన చైర్మన్ పదవిని ,పోలీసుల సాయంతో కిడ్నాప్ కేసు పెట్టి మీ వ్యక్తిని చైర్మన్ చేయలేదా? అన్నారు. గత ఐదు ఏళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా చేశారని, ఇప్పుడు చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు యాపరాల చిన్న, అన్నవరం సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి. బురుగోళ్ల చిన్న, తుపాకుల రమణ, బండి అమర్‌నాధ్, బీఎన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ :** స్థానిక పార్టీ కార్యాలయంలో మైదుకూరు నియోజకవర్గంలోని 21 మందికి సుమారు రూ. 28 లక్షలను సీయం రిలీఫ్ ఫండ్‌ను చెక్కుల రూపంలో ఎమ్మెల్యే బాధితులకు అందించారు. ఆపదలో ఆసుపత్రులకు ఖర్చుచేసుకొని ఇబ్బందిపడుతున్న వారికి సీఎంరిలీఫ్ ఫండ్ ఉపయోగపడుతుందన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిది



చెక్కులను అందజేస్తున్న రితేష్‌రెడ్డి

కాశినాయన జూలై15(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని బద్వేల్ టీడీపీ సమన్వయకర్త క్.రితేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మండలంలోని బాలాయపల్లె, గంగనపల్లె గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు.ఈకార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు బసిరెడ్డి రవీంద్రారెడ్డి, క్రిష్టారెడ్డి, వెంకట్రామిరెడ్డి, పోలిరెడి,వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రిని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



సిబ్బందితో మాట్లాడుతున్న నాగరాజు

చాపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చాపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో నాగరాజు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి ప్రతి రోజు రోగులు ఎంత మంది వస్తున్నారని డాక్టర్ శ్రీవాణిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

## 'ఎన్నికల హామీలు నెరవేర్చని చంద్రబాబు'

చాపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటికి నెరవేర్చలేదని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం వైసీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా వారిని మోసం చేశారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేసిన మంచి పరిపాలన గురించి ప్రజలకు వివరించాలన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

జమ్మలమడుగు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మలమడుగు వైసీపీ కార్యాలయంలో కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి, గజ్జెల లక్షుమయ్య, ప్రసాద్‌రెడ్డి, గురప్ప పాల్గొన్నారు. అనంతరం గండికోటలో హత్యకు గురైన బాలిక మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో సందర్శించారు. మృతురాలి బంధువులతో రామసుబ్బారెడ్డి మాట్లాడారు.

## చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

పోరుమామిళ్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల చెరవు నుంచి రంగసముద్రం చెరువులో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ జిల్లా కార్యదర్శి చాపాటి నారాయణరెడ్డి తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగసముద్రం పంచాయతీ పరిధిలో కొందరు అక్రమ మార్గంలో పట్టాలు పొంది అధికారులకు తప్పుడు నివేదికలు సమర్పించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు.

## మహిళా రక్షణకు శక్తి యాప్ ఉక్కు కవచం



శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బద్వేలుటౌన్, జులై 15 (ఆంధ్రజ్యోతి) : మహిళా రక్షణకు శక్తియాప్ ఒక ఉక్కు కవచంలాంటిదని ఏహెచ్‌టీయూ హైదర్ బాషా, ఎస్‌బీవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్యలు అన్నారు. మంగళవారం ఎస్‌బీవీఆర్ డిగ్రీకళాశాలలో విద్యార్థినులకు శక్తియాప్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు, బాలికల భద్రత కొరకు శక్తియాప్‌ను రూపొందించిందని, ఈ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఏదైనా ప్రమాదం జరిగితే ఈ యాప్‌ను ఓపెన్ చేసి ఎస్‌ఓసి బటన్ నొక్కితే పోలీసులు వెంటనే స్పందిస్తారన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, మైదుకూరు ఎస్ఐ సుబ్బారావు, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్తలు దొరసామి నాయక్ పాల్గొన్నారు.